Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 240 | పేజీలు 8 | వెల : 5 | ఫిబ్రవరి 05 బుధవారం 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్లాక్ & వైట్ పేజీ |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| | ఫ్రంట్ పేజీ : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

## నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు


**పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**

**హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆప్ పోరాటం**



2వ

# ప్రజలపై అదనపు భారం మోపలేం



**ఆదాయం పెంచుకోవడమే మార్గం**

**ఇందుకోసం వినూత్న విధానాలు ఆలోచించండి**

**ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు**

అమరావతి: వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయని.. అయినప్పటికీ ప్రభుత్వానికి ఆదాయం కోసం ప్రజలపై అదనపు భారం మోపలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆదాయార్జన శాఖల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఏ ఒక్కరూ పన్ను ఎగవేతకు పాల్పడకుండా చూడాలని, అలాగని వ్యాపారులను వేధింపులకు గురిచేయవద్దని సీఎం సూచించారు. రాష్ట్ర ఆర్థిక వనరులు, ఆదాయ వృద్ధిపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. రాష్ట్ర ఆదాయం రూ.1,02,154 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు, పురోగతిపై అధికారులు సీఎంకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య పన్నుల విభాగంలో మొత్తం రూ.41,420 కోట్లు రాగా.. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.41,382 కోట్లు వచ్చిందని తెలిపారు. ఈ విభాగంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో వృద్ధి ఉంటుందని చెప్పారు. గత సంవత్సరంతో పోల్చితే నూతన ఎక్సైజ్ విధానం వల్ల ఆ శాఖలో ఆదాయం పెరుగుతుందని వివరించారు. గనుల శాఖలో ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో ఆదాయం రాలేదన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యాట్, జీఎస్టీ, ఎక్సైజ్, వృత్తి, వాణిజ్య పన్నుల ద్వారా వచ్చే రాబడి స్వల్పంగా పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం రూ.1,02,154 కోట్లు ఉండొచ్చని తెలిపారు. కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి కృషి, గనుల తవ్వకానికి అనుమతుల మంజూరు వంటి చర్యల ద్వారా ఆ శాఖలో రాబడి పెంచాలని సూచించారు. ఆదాయార్జనపై ఇకపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తానన్నారు. ఆదాయం బాగుంటేనే అభివృద్ధి వైకాపా హయాంలో ఆర్థికంగా కుదేలైన రాష్ట్రం మళ్లీ అభివృద్ధి చెందాలంటే ఆదాయార్జన శాఖలు ఉత్తమ ఫలితాలు రాబట్టాలని సీఎం నిర్దేశించారు. సాధారణ పనితీరు, లక్ష్యాలతో పనిచేస్తే ఫలితాలు రావని.. ఆదాయం పెంచేందుకు వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు ఆర్థిక వనరులు ఎంతో కీలకమన్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని రోజువారీ పురోగతి చూపించేలా ఆదాయార్జన శాఖల్లో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. కేంద్ర నిధులు రాబట్టేందుకు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానన్నారు. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియాను దిల్లీలో కలిసి 1.45 గంటలపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరించానని తెలిపారు.

# వికసిత భారత్ తమ ధృడసంకల్పం



2వ

- ఆ లక్ష్యం దిశగా పయనిస్తున్నాం
- రాష్ట్రపతి ప్రసంగంలో ఇదే స్పష్టం చేశాం
- రాబోయే 25 ఏళ్ల కాలానికి ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాం
- తప్పడు హామీలతో ప్రజలను మోసం చేయడం లేదు
- కొందరు సెల్ఫీలు దిగుతూ..అద్దాల మేడల్లో ఉంటారు
- ప్రతి రూపాయి గ్రామానికి చేరుకునేలా చూస్తున్నాం
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి మోడీ సమాధానం

# తిరుమలలో వైభవంగా రథసప్తమి

**సృతవాహనసేవల్లో అనుగ్రహించిన శ్రీవారు**

**శ్రీవారిని దర్శించుకున్న వేలాదిమంది భక్తులు**




తిరుమల: తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవంగా సాగాయి. దేవదేవుడిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు రతలి వచ్చారు. వామన సేవల్లో పాల్గొన్నారు. మాడవీధులు గోవింద నామస్మరణతో మారుమోగాయి. రథసప్తమి సందర్భంగా శ్రీనివాసుడు సప్తవాహనాల్లో భక్తులను అనుగ్రహించారు. సూర్యజయంతి సందర్భంగా సూర్యప్రభ వాహనంతో మొదలై చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చందప్రభ వాహనాలపై ఒకేరోజు స్వామివారు అనుగ్రహించారు. అందుకే ఈ ఉత్సవాన్ని అర్ధ బ్రహ్మోత్సవం, మినీ బ్రహ్మోత్సవం, ఒకరోజు బ్రహ్మోత్సవంగా పిలుస్తుంటారు. సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు ఏడు వాహనాలపై స్వామివారిని వేంచేపు చేస్తారు. అత్యంత ప్రధానమైన రథసప్తమి వాహనసేవ సూర్యప్రభవాహనం. సర్వలోకాలకు చైతన్యాన్ని కలిగిస్తూ ఉదయించే శ్రీ సూర్య భగవానుడు తన ఉషారేఖలను ఉదయం 6.48 గంటలకు శ్రీవారి పాదాలపై ప్రసరింపచేశాడు. ఈ వాహన సేవను తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్యప్రభ వాహనంలో ఉండే స్వామిని దర్శించుకుంటే సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు సిద్ధిస్తాయి.

సూర్యప్రభ వాహనం తర్వాత ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్న శేషవాహనంపై శ్రీవారి చిద్విలాసాన్ని చూసి తరించారు భక్తులు. చిన్న శేషుడిని నాగలోకానికి రాజుగా భావిస్తారు. వైష్ణవ సంప్రదాయం అనుసరించి భగవంతుడు శేషి..ఈ ప్రపంచం శేషభూతం అని అర్థం. చిన్నశేష వాహనంపై శ్రీవారిని దర్శించుకుంటే కుటుంబ శ్రేయస్సు ఉంటుందని భక్తుల విశ్వాసం

రథ సప్తమి ఉత్సవాల్లో భాగంగా సూర్యప్రభ, చిన్న శేష వాహనం తర్వాత గరుడ వాహనంపై దర్శన మిచ్చారు మలయప్ప స్వామివారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు గరుడవాహనంపై శ్రీవారిని దర్శించుకున్నారు భక్తులు. జ్ఞానవైరాగ్యానికి రూపం అయిన రెక్కలతో విహరించే గరుడుడిపై కొలువైన మలయప్పస్వామిని దర్శించుకుంటే సకలపాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం

రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా నాలుగో వాహనసేవ హనుమంత వాహనం. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకూ మలయప్పస్వామి హనుమంతవాహనంపై మాడవీధుల్లో విహరించారు. భక్తులలో అగ్రగణ్యుడు అయిన ఆంజనేయుడు చతుర్వేద నిష్ణాతుడుగా, నవవ్యాకరణ పండితుడుగా, లంకాభీకరుడిగా ప్రసిద్ధి. హనుమంతవాహనంపై విహరించే



మలయప్పస్వామి దర్శనం సకల భయాలను రూపుమాపి, ఆయురారోగ్యాలను ప్రసాదిస్తుంది.

పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. రథసప్తమి సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 2 నుండి 3 గంటల మధ్య చక్రస్నానం వైభవంగా జరిగింది.శ్రీ వరాహస్వామివారి ఆలయం వద్ద గల స్వామిపుష్కరిణిలో చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తెనె, చందనంతో అర్చకులు అభిషేకం నిర్వహించారు.ఈ వాహన సేవల్లో ఇక్ష జె శ్యామల రావు, అదనపు ఇక్ష సిహెచ్ వెంకయ్య చౌదరి, ఏఇక్ష శ్రీ వి వీరబ్రహ్మం, పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, నన్నపనేని సదాశివరావు, జి.భానుప్రకాష్ రెడ్డి, ఇంఛార్జి అ÷ూక్ష మణికంఠ తదితరులు పాల్గొన్నారు.




## ఏపీలో 3 కమిటీలకు ఛైర్మన్‌ల నియామకం.. నోటిఫికేషన్ జారీ చేసిన స్పీకర్

అమరావతి: ఏపీ శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల ఛైర్మన్‌లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రజాపద్దుల సంఘం ఛైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు నియామకాన్ని ఆమోదిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడు ఫైనాన్షియల్ కమిటీలకు ఛైర్మన్‌లను నియమిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫైనాన్షియల్ కమిటీల నియామకం పూర్తైనట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 175 మంది శాసనసభ్యుల నుంచి 9 మంది చొప్పున, 58 మంది శాసనమండలి సభ్యుల నుంచి ముగ్గురు చొప్పున మూడు కమిటీల్లో నియమించారు.

**ఏపీ శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.**

# ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన



హైదరాబాద్,: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోర్టు తీర్పు అమలు కోసం ఏకసభ్య కమిషన్ వేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ సిఫారసు చేసింది. కమిషన్ పలు జిల్లాల్లో పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించింది. నేరుగా ప్రజలను కలుసుకుని విజ్ఞప్తులు సేకరించింది. మరికొందరు కమిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా విజ్ఞప్తులు అందించారు. 82 రోజుల్లో కమిషన్ తన నివేదికను అందించింది. 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను 3 గ్రూపులకు పంచుతూ కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీల్లో మొత్తం 59 ఉప కులాలను గ్రూప్-1, 2, 3గా వర్గీకరించాలని కమిషన్ సిఫారసు చేసింది.గ్రూప్-1లోని 15 ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్ (జనాభా 3.288 శాతం), గ్రూప్-2లోని 18 ఎస్సీ ఉపకులాలకు 9శాతం రిజర్వేషన్ (జనాభా 62.74 శాతం), గ్రూప్-3లోని 26 ఉప కులాలకు 5శాతం రిజర్వేషన్ (జనాభా 33.963శాతం) కల్పించాలని వర్గీకరణ కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఎస్సీ కులాల గ్రూప్‌లకు రోస్టర్ పాయింట్లు, క్రిమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీ వర్గీకరణ, కులగణన.. నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశాలు. నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుండి పోతుందని సిఎం రేవంత్ అన్నారు. ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం నాకు వచ్చింది. చాలా రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయి తప్ప.. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించాం. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నా అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 30, 40 ఏళ్ల నాటి ఆకాంక్ష నేడు సాకారం అవుతోందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల కొందరిలో భయం, అభద్రతాభావం కలుగుతోంది. వర్గీకరణ వల్ల ఎవరి ప్రయోజనాలకు విఘాతం కలగదు. అంటరానితనం అనేది ప్రపంచం అంతటా ఉంది. ఎంత చదువుకున్నా.. ఎంత ఎదిగినా.. ఎక్కడో ఒకచోట వివక్ష ఎదుర్కోవాల్సి వస్తుంది. గాంధీజీ, అంబేద్కర్ వంటి మహనీయులకు కూడా వివక్ష తప్పలేదు. సామాజిక న్యాయం ఎక్కువగా కల్పించింది కాంగ్రెస్ పార్టీయే. 50 ఏళ్ల క్రితమే దళితనేత దామోదరం సంజీవయ్యను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంను చేసింది కాంగ్రెస్ పార్టీ. జగ్జీవన్‌రామ్, దామోదరం సంజీవయ్య వంటి వారికి ఉన్నత పదవులు ఇచ్చింది. సామాజిక ఫలాలు అందరికీ అందాలనేది కాంగ్రెస్ పార్టీ తపన. ఎస్సీ వర్గీకరణ నిర్ణయం రాజకీయ కారణాలతో తీసుకోలేదు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి తీసుకున్న నిర్ణయం ఇది. ప్రభుత్వానికి సంబంధం లేకుడా కమిషన్ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఉంటుందని ఏఐసీసీ ఎప్పుడో చెప్పిందని పేర్కొన్నారు. 30 ఏండ్ల ఉద్యమానికి ఈ రోజు పరిష్కారం దొరికిందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణ రిపోర్ట్ పై అసెంబ్లీలో తీర్మానం సందర్భంగా మాట్లాడిన ఆయన.. వర్గీకరణ ఏ వర్గానికి వ్యతిరేకం కాదన్నారు. సామాజిక న్యాయం అంబేద్కర్ కల అని చెప్పారు.

## నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

న్యూఢిల్లీ: బుధవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 గా ఉంది.ఈ ఎన్నికల్లో మరోమారు అధికారం దక్కించుకుని హ్యాట్రిక్ కొట్టాలని ఆప్ భావిస్తోంది. బీజేపీ దీటుగా ప్రచారం నిర్వహించింది. కాంగ్రెస్ కూడా ఒంటరి పోరాటం చేస్తోంది. తృణమూల్, సమాజ్‌వాదీ పార్టీలు ఆప్‌కు మద్దతుగా నిలిచాయి.

## వికసిత భారత్ తమ ధృడసంకల్పం

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించిందని ప్రధాని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి పద్నాలుగు సార్లు సమాధానం ఇచ్చే అదృష్టాన్ని దేశ ప్రజలు తనకు ఇచ్చారని, ఇందుకు తాను ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంటులో రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి లోక్‌సభలో ప్రధాని సమాధానమిస్తూ,

'మనం 2025లో ఉన్నారు. ఒకరకంగా 21వ శతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏళ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏళ్లలో, వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుకొలిపే దిశగా పనిచేయనున్నాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచిందని మోదీ అన్నారు. 'గరీబీ హటావో' నినాదంపై మాట్లాడుతూ, ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని ప్రధాని అన్నారు. ఇంతవరకూ పేదలుకు 4 లక్షల గృహాలు ఇచ్చామని, గతంలో మహిళలు బహిర్భూమి సిస్టమ్ లేక అవస్థలు పడవారని, ఎవరైతే అన్ని సౌకర్యాలు ఉన్నారో వారికి ఇలాంటి అవసరాలు అర్థం కావని పరోక్షంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చురకలు వేశారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా 2కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. అంకితభావంతో పథకాలు అమలు చేసినప్పుడే ఇలాంటి మార్పు సంభవమని అన్నారు. పేదల గురించి ఉత్తుత్తి హామీలు తాము ఇవ్వమని, అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని, వాటిని అధిగమించేలా చేసేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు. 'ప్రజల సొమ్ము ప్రజల చేతికే' అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగిందన్నారు. మా హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయోగించలేదు.. దేశాభివృద్ధికి వినియోగించాం. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ తయారవుతోంది. మే అధికారంలోకి

రాకముందు ఎల్‌ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది. మా ప్రభుత్వం రాగానే ఎల్‌ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. దీని ద్వారా దేశ ప్రజలకు రూ.20వేల కోట్లు ఆదా అయింది. మా పాలన బాగుండటం వల్లే మళ్లీ గెలుస్తున్నాం. హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. మహారాష్ట్రలోనూ తిరిగి అధికారంలోకి వచ్చాం'అని ప్రధాని వివరించారు. అలాగే ప్రధాని తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పరోక్షను ప్రస్తావిస్తూ, పేదల గుడిసెల్లో ఫోటో సెషన్లతో సరదాగా గడిపేవారికి పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతూ చేసే ప్రసంగాలు బోర్‌గానే ఉంటాయని అన్నారు. కొందరు నాయకులు విలాసవంతమైన షవర్లు కోరుకుంటారని, తమ ప్రభుత్వం మాత్రం ప్రతి ఇంటికి నీళ్లు ఇవ్వడంపై దృష్టిసారిస్తుందని కేజ్రీవాల్ విలాసవంతమైన శీష్ మహల్ పై పరోక్ష విమర్శలు గుప్పించారు. ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామలకు 16 పైసలే చేరుతోందని గతంలో ఒక ప్రధాని వాపోయారని, ఢిల్లీ నుంచి గల్లీ వరకూ అప్పట్లో అదే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. అయితే ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోందని, నగదు బదిలీతో నేరుగా ప్రజలకే సొమ్ము అందుతోందని వివరించారు. ప్రధాని ప్రసంగిస్తున్నంత సేపు అధికారపక్షం సభ్యులు చప్పట్లతో అభినందించారు.

## తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ

**అమరావతి:** తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా 26.. వైఎస్సార్‌సీపీకి 21 ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి విజయం సాధిస్తుందని నిన్ననే చెప్పామని అనుకున్నది సాధించామని అన్నారు. నిన్న తమ కార్పొరేటర్లు నలుగురిని వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డుకుని, కిడ్నాప్ చేశారని.. కిడ్నాప్ అయిన వారందరూ తిరిగి వచ్చేశారని తెలిపారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 26 ఓట్లతో విజయం సాధించిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డదారిన గెలవాలని చూశారని.. దానిని తిప్పి కొట్టామని ఆరణి శ్రీనివాస్ చెప్పారు. శ్రీవారి ఆశీస్సులతో ఎన్డీయే కూటమి అభ్యర్థి మునికృష్ణ ఎన్నిక లాంఛనంగా గెలుపొందారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మునికృష్ణ మాట్లాడుతూ.. 26 మంది సభ్యులు తనకు ఓట్లు వేసి డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన కార్పొరేటర్లకు, అండగా నిలిచిన ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్థానిక మంత్రి, తనకు మద్దతు తెలిపిన ఇతర నాయకులకు మనికృష్ణ ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తామని, కూటమి నేతలను కలుపుకుని తిరుపతిలో ఎక్కడా ఏ ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాగా తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఎంతో ఉత్కంఠభరితంగా జరిగింది. సోమవారం జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. అలాగే మంగళవారం కూడా ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రశాంతంగానే ఓటింగ్ జరిగింది. చివరికి కూటమి అభ్యర్థి గెలుపుతో కథ సుఖాంతమైంది. 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్ ఆఫిషియో నెంబర్లు.. మొత్తం 50 మంది. అయితే ఓటింగ్‌లో 48 మంది పాల్గొన్నారు. ఇద్దరు అనారోగ్యంతో రాలేకపోయారు. దీంతో ఓటింగ్ నిర్వహించిన ఎన్నికల అధికారి ముందు వైఎస్సార్‌సీపీ వాళ్లు చేతులెత్తాలని కోరగా 21 మంది చేతులెత్తారు. తర్వాత కూటమి నేతలు 26 మంది చేతులెత్తారు. దీంతో కూటమి అభ్యర్థి మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా గెలుపొందినట్లు అధికారి ప్రకటించారు. కాగా డిప్యూటీ మేయర్ ఎన్నిక సోమవారం జరగాల్సి ఉంది. కోరం లేక ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. ఆదివారం రాత్రి నుంచి తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికపై హై డ్రామా కొనసాగింది. ఆదివారం రాత్రి టీడీపీ శిబిరంపై వైఎస్సార్‌సీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. కార్పొరేటర్‌ను వైఎస్సార్‌సీపీ నేత భూమన లాక్కెళ్లినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. కోరం 25 మంది ఉండాలి. అయితే 22 మంది మాత్రమే ఉన్నారు. దీంతో అధికారులు ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికను మంగళవారం నాటికి వాయిదా వేశారు. దీంతో మంగళవారం గట్టి బందోబస్తు మధ్య డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. మరోవైపు తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తిరుగుబాటు చేశారు. కొంతమంది కూటమిలో చేరారు. పాలనలో తమకు స్వేచ్ఛలేదని కూటమిలో చేరడంవల్ల తమకు గౌరవం పెరిగిందని కార్పొరేటర్లు అన్నారు.

## హిందూ ధర్మాలు, ఆలయాలు కాపాడటమే సీఎం చంద్రబాబు లక్ష్యం

అమరావతి: హిందూ ధర్మాలు, ఆలయాలను కాపాడాలనేది సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన అని ఏపీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. హిందువులకు ఆరాధ్య దైవమైన శ్రీ సూర్యనారాయణ స్వామి పండుగే రథసప్తమి అని చెప్పారు. భూప్రపంచానికి సూర్యోదయంతోనే వెలుగులు నిండుతాయని అన్నారు. సీఎం చంద్రబాబు సూచనతో అరసవెల్లిలో జరిగే రథసప్తమి వేడుకలను, రాష్ట్రంలో జరిగే వేడుకలను ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తించామని అన్నారు.

అరసవెల్లిలో జరిగే వేడుకల్లో సీఎం చంద్రబాబు పట్టవస్త్రాలు సమర్పించాల్సి ఉందని... కానీ ఎన్నికల కోడ్ వల్ల అధికారులనే పట్టువస్త్రాలు సమర్పించాల్సిందిగా ఆదేశాలిచ్చామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గుర్తుచేశారు. నెల్లూరు మూలాపేట శివాలయంలోని

సూర్యభగవానుడికు ప్రత్యేక పూజలు నిర్వహించామని అన్నారు. అనాధిగా తమ కుటుంబం రథసప్తమి పూజలు నిర్వహిస్తుందని వివరించారు. రాష్ట్రంలో పలు ఆలయాల పుననిర్మాణానికి నిధుల కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో 18 ఆలయాల పున నిర్మాణాలకు రూ.38కోట్ల నిధులు విడుదలయ్యాయని ప్రకటించారు. మహాశివరాత్రి రోజున శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, దాక్షారామంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. మూలాపేట శివాలయం అభివృద్ధికి మంత్రి నారాయణతో కలిసి ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఏపీలో రాతికట్టడాలకు గత జగన్ ప్రభుత్వంలో రంగులు వేయడం వల్ల పవిత్రతను కోల్పోయాయని తెలిపారు. ఆ రంగులు తొలగించి, వాటిని కాపాడుతామన్నారు. చరిత్ర, పవిత్రతను భవిష్యత్తు తరాలకు అందిస్తామని చెప్పారు. అందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం. భక్తులు తమ ప్రభుత్వానికి అండగా ఉన్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

## నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి

విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నికయ్యారు. ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యురాలు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో పాటు 18 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ క్రమంలో నిర్వహించిన ఎన్నికలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిపి కృష్ణకుమారికి 15 మంది మద్దతు లభించింది. వైకాపా అభ్యర్థి ఓర్సు లక్ష్మికి కేవలం ముగ్గురే మద్దతు తెలిపారు. దీంతో ఛైర్‌పర్సన్‌గా కృష్ణకుమారి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల ప్రత్యేకాధికారి, ఆర్డీవో బాలకృష్ణ ఆమెకు అందజేశారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా-13, తెదేపా-6, జనసేన-1 చొప్పున గెలిచారు. ఆ తర్వాత తెదేపా నుంచి ఒకరు వైకాపాలో చేరారు. ఛైర్‌పర్సన్‌గా వైకాపా నుంచి మండవ వరలక్ష్మి, వైస్‌ఛైర్‌పర్సన్‌గా మాడుగుల నాగరత్నం ఎంపికయ్యారు. ఆ తర్వాత వీరు చనిపోయారు. ప్రస్తుతం ఏడుగురు కౌన్సిలర్లు వైకాపాను వీడి తెదేపాలో చేరడంతో తెదేపా బలం 5 నుంచి 12కు పెరిగింది. జనసేనతో కలిపితే 13. ఎమ్మెల్యేతో కలిపి 14 ఓట్లు ఉన్నాయి. వైకాపాలో ఐదుగురు మిగలగా.. వీరిలో ఒకరు రాజీనామా చేయడంతో నలుగురే మిగిలారు. ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌తో కలిపి ఆ పార్టీకి ఐదు ఓట్లున్నాయి. తాజాగా జరిగిన ఛైర్‌పర్సన్ ఎన్నికలో వైకాపాకు కేవలం ముగ్గురే మద్దతు తెలపడం గమనార్హం.

## మూడు శాసనసభ కమిటీలకు ఛైర్మన్ల నియామకం

అమరావతి: ఏపీ శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల ఛైర్మన్‌లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రజాపద్దుల సంఘం ఛైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు నియామకాన్ని ఆమోదిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడు ÷నాన్షియల్ కమిటీలకు ఛైర్మన్‌లను నియమిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నోటిఫికేషన్ జారీ చేశారు. ÷నాన్షియల్ కమిటీల నియామకం పూర్తైనట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 175 మంది శాసనసభ్యుల నుంచి 9 మంది చొప్పున, 58 మంది శాసనమండలి సభ్యుల నుంచి ముగ్గురు చొప్పున మూడు కమిటీల్లో నియమించారు.

## దేశంలో మరిన్ని సివిల్ ఏవియేషన్ కాలేజీలు రావాలి

**న్యూఢిల్లీ:** దేశంలో మరిన్ని సివిల్ ఏవియేషన్ కాలేజీలు ఏర్పాటు చేయాలన్న రాజ్యసభ ఎంపీ సుధామూర్తి, విజయపురకు విమానాలు ఎప్పుడు వస్తాయని రాజ్యసభలో ప్రశ్నించారు. రాజ్యసభలో సుధామూర్తి మాట్లాడుతూ.. 'కర్ణాటకలో ప్రముఖ టూరిస్ట్ స్పాట్ విజయపుర. పర్యాటకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎయిర్ పోర్ట్ సిద్ధం చేశారు. దీనిపై కర్ణాటక ప్రభుత్వంతో నేను మాట్లాడాను. కేంద్ర ప్రభుత్వం తమకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఈ సందర్భంగా ఓ విషయం అడుగుతున్నాను. విజయపురకు విమానాలు ఎప్పుడు ప్రారంభం కానున్నాయి. నేను ఎప్పుడు అడిగినా త్వరలోనే తెలుస్తుందని చెబుతున్నారు. ఈసారి అలా కాదు. కచ్చితంగా దీనిపై మాకు సమాధానం కావాలి.

54 సివిల్ ఏవియేషన్ కాలేజీలు ఉన్నాయి. 140 కోట్ల భారతీయులకు ఇది చాలా తక్కువ అని నా అభిప్రాయం. దేశ వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో సివిల్ ఏవియేషన్ కాలేజీలు, కేంద్రాలు లేవు. దీనిపై కేంద్రం ఫోకస్ చేయాలి. ఇది మా రిక్వెస్ట్' అని సుధామూర్తి రాజ్యసభలో ప్రశ్న లేవనెత్తారు. సుధామూర్తి అడిగిన ప్రశ్నకు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించి ఇచ్చిన సమాధానం అందర్నీ ఆకట్టుకుంటోంది. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఇది తిరుపతికి సంబంధించిన విషయం. అయితే సుధామూర్తిగారు విజయపుర పేరును ఇక్కడ ప్రస్తావించారు. విజయపురకు త్వరలోనే విమానాలు వస్తాయి. ఇదే ఏడాది అది అమలు చేస్తాం. కావాలంటే లిఖిత పూర్వకంగా మీకు సమాధానం ఇస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దీనిని సాధ్యం చేస్తాం. సివిల్ ఏవియేషన్ కాలేజీలు 54 మాత్రమే ఉన్నాయి. అందులో పైలట్లతో పాటు మెయింటనెన్స్ ఇంజినర్లకు ట్రైనింగ్ ఇస్తారు. మరో 3 కాలేజీకు అప్రూవల్ వచ్చింది. మరో 9 ఏవియేషన్ కాలేజీల కోసం కేంద్రం చర్యలు ప్రారంభించింది. ప్రతి ఏడాది 1500కు పైగా పైలట్లు శిక్షణ తీసుకుంటున్నారు. దేశంలో మరికొన్ని కాలేజీలు అవసరం ఉంది కనుక ఎవరైనా ప్రైవేట్ సంస్థలు ఇందుకోసం ముందుకొస్తే కేంద్రం వారికి సహకారం అందిస్తుంది. వచ్చే 5 ఏళ్లలో దేశంలో 50 ఎయిర్ పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. 10 ఏళ్లలో 100, 20 ఏళ్లలో 200 విమానాశ్రయాలు నిర్మించి విమాన సర్వీసులు అందించాలని కేంద్రం భావిస్తోంది. కానీ విమానాశ్రయాలతో పాటు అక్కడ పార్కింగ్, ఆ స్థాయిలో స్థలం సేకరణ లాంటి చాలా అంశాలు ఆలోచించాలి. మౌలిక సదుపాయాలు కల్పించడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

# ఇది ప్రజాస్వామ్య ఓటమి

**అమరావతి**:తిరుపతి మున్సిప్ల డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై రోజా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉప మేయర్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఓటమిని ప్రజాస్వామ్య ఓటమిగా మాజీ మంత్రి ఆర్కే రోజా అభివర్ణించారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీషని విధుల నిర్వహణలో అవమానించారని ఆమె మండిపడ్డారు. తిరుపతి కార్పొరేషన్ సమావేశం లోపల జరుగుతుంటే బయట మేయర్ శిరీష ఆందోళన చేసే పరిస్థితి దేనికి సంకేతమని ప్రశ్నించారు. తిరుపతి ఎంపి గురుమూర్తి ప్రయాణిస్తున్న బస్సు పై దాడి చేశారని.. నిన్న బస్సులో బయలుదేరిన వైసీపీ కార్పొరేటర్లు ఇవాళ రాలేదన్నారు. మాతో నిన్న వచ్చి నేడు ఎన్నికల్లో మాకు వ్యతిరేకంగా ఓటు వేయడం నిన్న రాత్రి జరిగిన పరిణామాలకు కొనసాగింపు కాదా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ఒక్క ఓటు ఉన్న టీడీపీ కార్పొరేటర్ తిరుపతి డిప్యూటీ మేయర్‌గా గెలిచారన్నారు. వైసీపీ విప్ జారీ చేసింది. రిటర్నింగ్ అధికారి మా సభ్యులు విప్ దిక్కరించిన కారణంగా కార్పొరేటర్లను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కానీ అవేమీ జరగలేదని, జరిగిన పరిస్థితిని గమనిస్తే తిరుపతిలో ఎన్నికలు ఎంత ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయో అందరికీ అర్థమవుతుందని ఆర్కే రోజా మండిపడ్డారు. మేము ఓడి గెలిచాం, టీడీపీ వాళ్లు గెలిచి ఓడిపోయారు. అంతిమంగా ఒకటే చెపుతున్నా.. ఇక్కడ మేం ఓడిపోలేదు.. వ్యవస్థల ఉదాసీన వైఖరి, అధికార దుర్వినియోగం తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో గెలిచాయని ఆర్కే రోజా స్పష్టం చేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారితోపాటు రాష్ట్ర ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారే దీనికి సమాధానం చెపుతారని ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. వైసీపీ కార్పొరేటర్ లడ్డూ భాస్కర్ తరపున మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ రాధాకృష్ణ ప్రతిపాదించారు. టీడీపీ అభ్యర్థి మునికృష్ణ తరపున ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేటర్ అన్నె అనిత ప్రతిపాదన చేశారు. మంగళవారం ఉదయం నిర్వహించిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి 21 ఓట్లు పడగా... టీడీపీ అభ్యర్థి మునికృష్ణకు 26 ఓట్లు వచ్చాయి. దాంతో తిరుపతిలో ఏకైక టీడీపీ కార్పొరేటర్ గా ఉన్న ఆర్సీ మునికృష్ణ ఇప్పుడు తిరుపతి డిప్యూటీ మేయర్ గా విజయం సాధించారు.

## టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు మార్గం సుగమం

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు మార్గం సుగమమైంది. ఈ ఫలితాల విడుదలకు అడ్డుగా ఉన్న రెండు కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో వచ్చే 10, 12 రోజుల్లోనే గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలను విడుదలకానున్నాయి. ఈ మేరకు టీజీపీఎస్సీ కసరత్తు చేస్తుంది. జీవో 29ను సవాలు చేయడంతోపాటు వికలాంగుల రిజర్వేషన్ అంశాలపై పలువురు గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దానిపై టీజీపీఎస్సీ కేవియట్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇటీవల అత్యున్న ధర్మాసనం విచారణ జరిపి అభ్యర్థుల పిటిషన్లను కొట్టివేసింది. దీంతో గ్రూప్ 1 ఫలితాల విడుదలకు అన్ని అడ్డంకులు తొలగినట్లైంది. తెలంగాణ రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ 2025 నోటిఫికేషన్ మార్చి 6న విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. నోటిఫికేషన్ విడుదల తర్వాత మార్చి 10 నుంచి దరఖాస్తులు స్వీకరన చేపడతారు. టీజీ ఐసెట్ సెట్ కమిటీ సమావేశాన్ని సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించగా.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఐసెట్‌కు మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక ఐసెట్ పరీక్షలు జూన్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ పీజీఈసెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. మార్చి 17నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం అవుతాయి. సోమవారం కూకట్‌పల్లిలోని జేఎన్టీయూలో నిర్వహించిన సెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ అరుణకుమారి, కో కన్వీనర్ ప్రొఫెసర్ బీ రవీంద్రారెడ్డి పీజీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు.

# కేంద్రానికి కులగణన దారి చూపిస్తుంది

హైదరాబాద్: తెలంగాణలో కులగణన కేంద్రానికి దారి చూపిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశం సందర్భంగా మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. 56 శాతం బీసీలు, 17.5 శాతం ఎస్సీలు మొత్తం 73.5 శాతం ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రధానిపై కూడా ఒత్తిడి పెరుగుతుందని.. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నామని తెలిపారు. సభలో ప్రవేశపెట్టే డాక్యుమెంట్ భవిష్యత్‌లో ఎపుడైనా రిఫరెన్స్ డాక్యుమెంట్ అవుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే మొదటిసారి కులగణన చేసి చరిత్ర సృష్టించామని.. పకడ్బందీగా సర్వే చేసి సమాచారం సేకరించామని ముఖ్యమంత్రి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు, మంత్రివర్గ ఉపసంఘం, ఏక సభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం వెళ్తామని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదన్నారు. వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదని.. ప్రతిపక్ష నాయకుడు సభకు రావాలి కదా అని ప్రశ్నించారు. కులగణన రాజకీయం కోసం చేయడం లేదు ఈ డాక్యుమెంట్ ను డెడికేటెడ్ కమిషన్ తీసుకుటుందని.. కమిషన్ తగిన నిర్ణయం తీసుకొంటుందన్నారు.

88 జనరల్ సీట్లలో 30 సీట్లు బీసీలకు ఇచ్చాం, 33 శాతం సీట్లు ఇచ్చామని తమకు చిత్తశుద్ధి ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. కోర్టు ఇచ్చిన క్లిమిలేయర్ ను తిరస్కరించామని.. బీసీ రిజర్వేషన్ల పై కోర్టు ఆదేశాల మేరకు కమిషన్ వేశామన్నారు. కోర్టు ఆదేశాల మేరకే కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అసెంబ్లీ కి రాని వారు అసెంబ్లీ టైం గురించి మాట్లాడుతున్నారుని విమర్శించారు. ఉదయమే సభ ప్రారంబించి వెంటనే వాయిదా వేయడంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. సమగ్ర కుటుంబ సర్వే గురించి కొంత మంది మాట్లాడుతున్నారని.. ఆ రిపోర్ట్ ఎక్కడ ఉందో కూడా తెలియదని రేవంత్ చెప్పుకొచ్చారు.

సమగ్ర కుటుంబ సర్వే ఎవరు చేసారు.. ఎలా చేసారు.. ఆ రిపోర్ట్ ఎక్కడ పెట్టారో ఎవరికీ తెలియదన్నారు. మేము ఎన్నికల కోసం కులగణన చేయలేదు..అభివృద్ధి ఫలాలు అందించడం కోసమే మా తాపత్రయం అంతా.. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొందరు ఉప ఎన్నిక గురించి మాట్లాడుతున్నారు.. సిరిసిల్ల లో కేటీఆర్ సూసైడ్ చేసుకుంటడేమో అని వ్యంగ్యంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ప్రొసీజర్ లో భాగమని రేవంత్ అన్నారు. సుప్రీంకోర్టు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయడంతో తాము ఉపఎన్నికలకు రెడీ అని కేటీఆర్ ట్వీట్ చేయడంపై రేవంత్ ఇలా స్పందించారు.

## మరోసారి పోలీసులను ఆశ్రయించిన నటి లావణ్య

హైదరాబాద్:నార్సింగి పోలీస్ స్టేషన్‌ను సినీ నటి లావణ్య మరోసారి ఆశ్రయించారు. బిగ్ బాస్ ఫేమ్ ఆర్జే శేఖర్ బాషాపై ఆమె ఫిర్యాదు చేశారు. మస్తాన్ సాయి, శేఖర్ బాషా తనను డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు కుట్ర చేశారంటూ ఆమె కంప్లైంట్ ఇచ్చారు. ఈ మేరకు ఆధారాలను సైతం ఆమె పోలీసులకు సమర్పించారు. మస్తాన్ సాయి, శేఖర్ బాషాకు సంబంధించిన ఆడియోలను పోలీసులకు లావణ్య ఇచ్చారు. తనతోపాటు మరో యువతిని సైతం డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు వారిద్దరూ ప్రయత్నించారని లావణ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక



# టీడ్కో గృహాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చారు ఇంటి తాళలు మార్చారు:సిపిఐ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు ఫిబ్రవరి 4 మంగళవారం పట్టణ శివనగర్ ప్రాంతంలో నిర్మించిన టీడ్కో గృహాలు అర్హులైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చి, ఇంటి తాళాలు మార్చారనీ తక్షణమే లబ్ధిదారులకు ఇంటి తాళాల ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం రోజున లబ్ధిదారులతో మున్సిపల్ కమిషనర్ ను కలవడం జరిగింద ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ కార్యదర్శి జి జి.రంగన్న,సిపిఐ నాయకులు కేసి జబ్బర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వేచ్చించి గూడు లేని నిరుపేదల కోసం నిర్మించిన టీడ్కో గృహాలు పూర్తి స్థాయిలో నిర్మాణం అయినప్పటికీ అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వకుండా వైయస్సార్ ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చి ఇంటి తాళాలు ఇవ్వకుండా చేతులు దులుపేసుకోవడం జరిగిందినీ వారు తెలిపారు. సకాలంలో గృహాలు ఇవ్వకుండా
కాలయాపన చేయడం వల్ల ఆ గృహాలకు మెయింటినెన్స్ లేక, స్థిథిల వ్యవస్థకు చేరడం జరిగిందని వారు తెలిపారు.
ప్రస్తుతం మరలా తెలుగుదేశం కూటమి అధికారంలో వచ్చి 8 నెలలు కావస్తున్నా ఆ టీడ్కో గృహాల లబ్ధిదారులకు ఇంటి తాళాల ఇవ్వకుండా లబ్ధిదారులను సచివాలయ అధికారులు వేధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
ఇప్పటికే శివం నగర్ కాలనీలో ఉన్న టీడ్కో గృహాలలో జనాలు లేక ఆ గృహాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలగా మారాయని కాబట్టి తక్షణమే స్పందించి లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇవ్వాలని లేని పక్షంలో లబ్ధిదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని వారు హెచ్చరించారు. సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్
టీడ్కో గృహాలకు రిజిస్ట్రేషన్ పత్రాలు పొందిన లబ్ధిదారులకు తక్షణమే ఇంటి తాళాలు ఇవ్వాలని సచివాలయ అధికారులను ఆదేశించిన మున్సిపల్ కమిషనర్ కు సిపిఐ పార్టీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడ్కో గృహాల లబ్ధిదారులు మైబున్,హసీనా, అబ్దుల్లా, రఫీక్, మరియు సిపిఐ నాయకులు విజయేంద్ర,కాజా, ఇస్మాయిల్, రంజాన్ ,నజీర్ పాల్గొన్నారుఈ కార్యక్రమంలో టీడ్కో గృహాల లబ్ధిదారులు మైబున్,హసీనా, అబ్దుల్లా, రఫీక్, మరియు సిపిఐ నాయకులు విజయేంద్ర,కాజా, ఇస్మాయిల్ ,రంజాన్,నజీర్ పాల్గొన్నారు

# పార్కుల అభివృద్ధికి కృషి







## వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రణాళిక

## - మరో రెండు పార్కులు ఏర్పాటుకు చర్యలు

## ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 4 మంగళవారంప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించే విధంగా పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప (పెద్ద పార్క్) ను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రధాన రహదారుల్లో వాకింగ్ ట్రాక్లను ఏర్పాటుకు సోమప్ప సర్కిల్ వద్ద రహదారులను పరిశీలించారు. పార్క్ అభివృద్ధికి, కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు ఏర్పాటు గురించి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి గారితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ఉన్న పార్కులను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే విధంగా తయారు చేస్తామని తెలిపారు. అలాగే పట్టణంలోని మరో రెండు పార్కులను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్కులో కావాల్సిన సౌకర్యాలు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఉదయం పూట ప్రజలు వచ్చే వాకింగ్ కు, వ్యాయామం కు కావలసిన ఏర్పాట్ల గురించి చర్చించినట్లు తెలిపారు. అలాగే ప్రధాన రహదారుల్లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో వంచించిన కేజ్రీవాల్ !

అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరి..ఆయనకు తానే ఏకలవ్య శిష్యుడిగా ప్రచారం చేసుకుని.. రాజకీయాల్లోకి వచ్చిన ఓ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్..అవినీతి మరకలతో ఇప్పుడు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అవినీతి చుట్టూ కేజ్రీవాల్ అల్లుకు పోయారు. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం అన్నాహజారే నేతృత్వంలో జరిగిన ఉద్యమమే ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకకు దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు ఆప్ సంచలనంగా మారింది. ఆప్ టోపీలు ధరించి హమ్ ఆమ్ ఆద్మీ హూం.. అనేవారు. అవినీతిపై పోరాటాలు చేశారు. సామాజిక సమస్యలపై నృత్య రూపకాలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. సామాన్య ప్రజలకోసం ఇంతగా ఆలోచించిన పార్టీ లేదని, అవినీతి అంతం ఆవాలంటే ఆప్ రావాలన్న పార్టీగా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యమంత్రి అయిన కొత్తలో కేజీవ్రాల్ ప్రజా సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. దేశ వ్యాప్తంగా ఒకప్పుడు మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ సృష్టించిన సంచలనమే ఆప్ కూడా సృష్టించింది. కేజీవ్రాల్‌తో చేతులు కలిపేందుకు ఎందరో మేధావులు అనేక రాష్ట్రాల్లో ముందుకు వచ్చారు. వారిలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్ వంటి వారు ఉన్నారు. అలాంటి ఆప్ పూర్తిగా కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో గెలిస్తేనే.. కేజ్రీవాల్‌కు రాజకీయ భవితవ్యం ఉన్నట్లు. లేకుంటే ఆయనకు రాజకీయ సమాధి తప్పదు. అవినీతిపై పోరాటంలో కాంగ్రెస్‌పై యుద్ధం ప్రకటించిన కేజ్రీవాల్..అనతి కాలంలోనే దేశ ప్రజల మనసులు గెల్చుకున్నారు. ప్రజలు రాజకీయ నాయకుల అవినీతి పట్ల ఎంత అసహ్యంగా ఉన్నారనడానికి కేజ్రీవాల్ ఎదుగుదలే కారణం. కానీ అనతి కాలంలోనే కేజ్రీవాల్ నిజస్వరూపం బయటపడింది. ఆయన ముసుగు తొలగింది. అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు నడిచాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇందుకు పరాకాష్ట. అలాగే తన ఇంటిని వందల కోట్లతో అద్భుతంగా..అంటే బిజెపి మాటల్లో శీష్‌మహల్‌గా మార్చుకున్న తీరు ఆయన ప్రతిష్టను బాగా దిగజార్చింది. కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించిన కేజ్రీవాల్... కాంగ్రెస్ పంచనే చేరారు. ఇప్పుడు ఢిల్లీలో మాత్రం ఆయనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడు తోంది. ఆయన మంత్రులు అంతా అవినీతిలో పట్టుబడ్డారు. నిప్పులేనిదే పొగరాదన్నట్లు ...కేంద్రం ఎంతగా కక్షకట్టి కేసులు పెట్టినా..అవినీతి లేనిదే ఇవి నిలవవు. లిక్కర్ కేసులో బిఆర్ఎస్ అధినేత కవిత దూరిందం టేనే అవినీతి ఉందని స్పష్టం అయ్యింది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఎంతగా ఇప్పుడు అరిచి గీపెట్టినా ప్రజలు నమ్ముతారని అనుకోవడానికి లేదు. గెలుపు కోసం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని పక్కన పెట్టిన కేజ్రీవాల్, ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రాజకీయాలు మొదలు పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలు పక్కన పోయాయి. కేవలం తన స్వార్థ రాజకీయాలు మొదలు పెట్టారు. అందుకే పదేళ్లుగా ఢిల్లీ పీఠం పట్టుకుని గట్టిగా అతుక్కుపోయిన కేజ్రీవాల్‌కు ఈ ఎన్నికలు అంతు సులువు కాదు. ఆయన పక్కన ఉన్న ఎమ్మెల్యేలు అంతా పార్టీని వీడుతున్నారు. కేజ్రీవాల్నిజస్వరూప తెలిసిన వారు బయట పడుతున్నారు. అందుకే ఢిల్లీలో 2013 నుంచీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజీవ్రాల్ భవిష్యత్ ఏమిటి అన్న విషయం గతంలో ఏనాడు లేని విధంగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అవినీతి అన్న వ్యవహారం నుంచి కేజ్రీవాల్ వైదొలిగారు. బిజెపిని ఢీకొంటాడన్న భ్రమలు తొలగిపోయాయి. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజకయాంగా బీజేపీని ఒంటరిగా ఢీకొంటున్నారు. ఆ తరవాత అంతటి తెగువుతొ అరవింద్ కేజీవ్రాల్ రాజకీయంగా బిజెపికి ఎదురొడ్డి నిలిచాలిచారు.. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు దక్కించుకున్నా, ఆరునెలల తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చిపెట్టిందటే అది కేజ్రీవాల్ పట్ల ప్రజలకున్న విశ్వాసంగా చూడాలి. తన పథకాల్లో ప్రజల్లో ఆదరణ లభించడంతో తనకు తిరుగులేదని భావించి ఒక దశలో ప్రధానమంత్రి పదవి కోసం కూడా కలలు కన్న కేజీవ్రాల్, ఆ దిశగా రాజకీయాలు నడిపారు. అదే కేజ్రీవాల్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు, మహిళలు బస్సెక్కితే ఉచితంగా ప్రయాణించేందుకు గులాబీ రంగు టికెట్, మొహల్లా వైద్యశాలలు.. వీటన్నిటితో ఢిల్లీ ప్రజలు కేజీవ్రాల్ వైపే మొగ్గు చూపారు.

# ధూమపానం, గుట్కాలతో క్యాన్సర్ వాటికి దూరంగా ఉండడమే మేలు

హైదరాబాద్: ఈ మధ్య క్యాన్సర్ మరణలు పెరిగాయి. . పొగాకు, గుట్కా వంటి అలవాట్లతో పాటు, ఆహార పదార్థాల వల్ల కూడా క్యాన్సర్ వ్యాపిస్తోంది. క్యాన్సర్ ఆస్పత్రులు జనరల్ ఆస్పత్రులకన్నా కిటకిటాడుతున్నాయి. ఇది సోకిన వారు బతికి బట్టికట్టిన దాఖలాలు ఉండడం లేదు. ఏ స్టేజీలో ఉన్న మరణం తప్పడం లేదు. మంగళవారం నాడు ప్రపంచ కాన్సర్ దినోత్సవం. ఈ సందర్భంగా ..స్మోకర్స్ కు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కలిగి ఉంటే మంచిది. ప్రధానంగా గుట్కా,ధూమపానం ప్రాణాలను హరించేస్తోంది. ఆరోగ్యవంతమైన జీవనాన్ని ఆస్వాదించాలంటే పొగాకు, గుట్కాలకు దూరంగా ఉండాలి. పొగ తాగడం వ్యసనంగా మారక ముందే ఫుల్ స్టాప్ పెట్టడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పొగాకు, ధూమపానం అలవాట్లను మాన్పించడంలో సమాజంలో ప్రత ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. పొగాకు ఉత్పత్తులను ముందుగా అమ్మకుండా నిషేధించాలి. వాటిని తయారు చేయకుండా ఆంక్షలు విధించాలి. యువత సైతంచెడు స్నేహం వల్లో, సాంగత్య ప్రభావం వల్లనో పొగాకు
ను అలవాటు చేసుకుంటున్నారు.అందుకే కాలేజీల కు వెళ్లే విద్యార్థులపై తల్లి దండ్రులు ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరదా గా మొదలయ్యే అలవాటు వల్ల జీవితం అవాంఛనీయ ఘటనలకు దారి తీయటం వాంఛనీయం కాదు. యోగా చేయడం,ఏదైనా ఇతర పనుల పై దృష్టి పెట్టడం ద్వారా కూడా దమ్ము కొట్టాలి అన్న ఆలోచన ను క్రమ,క్రమంగా దూరం చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. .అధ్భుత ఫలితాన్ని సాధించవచ్చు అని చెప్పారు. పొగాకుతో క్యాన్సర్ ఎలా వస్తుంది అనే విషయం చెప్పటానికి,తెలుసుకోవటానికి వైద్యం చదవ వసరం లేదు. సిగరెట్, బీడీ తాగితే పొగాకు తో పెనవేసుకున్న రసాయనాలు శరీరం లోకి ప్రవేశించి కణాల డిఎన్ఏను నాశనం చేసే పనిలో పడతాయి. సిగరెట్ అలవాటు కు ముందు ,ఆ తర్వాత ఆరోగ్యం గురించి చెప్పొచ్చు. పొగతాగడం, గుట్కా తినం అంటే మృత్యువుకు 'దగ్గర' అయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయి.

# ఆదాయం ఎన్ని వేల కోట్లో తెలుసా?



ఈ ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్ తర్వాత దిగ్గజ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ స్టాక్స్ ఎంతలా పతనమయ్యాయో తెలిసిందే. ఆయా కంపెనీల లాభం, ఆదాయం కూడా పడిపోయాయి. ఇప్పుడిప్పుడే గాడిలో పడుతుండగా.. తాజాగా అదానీ గ్రూప్‌కు చెందిన ఒక కంపెనీ లాభం ఏకంగా 150 శాతం పెరిగింది. దిగ్గజ వ్యాపారవేత్త, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ కంపెనీలు మళ్లీ లాభాల బాట పడుతున్నాయి. ఈ సంవత్సరం జనవరిలో అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్.. అదానీ గ్రూప్‌పై సంచలన రిపోర్ట్ వదిలిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్.. స్టాక్ మార్కెట్లలో అవకతవకలకు పాల్పడుతోందని.. షేర్ల ధరల్ని కృత్రిమంగా పెంచుతోందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. ఆ దెబ్బకు అదానీ గ్రూప్ షేర్లు కకావికలమయ్యాయి. సగానికిపైగా షేర్లు పడిపోయాయి. ఆయన వ్యక్తిగత సంపద కూడా లక్షల కోట్ల మేర ఆవిరైంది. ఆ తర్వాత అదానీ గ్రూప్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు కూడా అంతంతమాత్రంగానే నమోదయ్యాయి.
కానీ ఇప్పుడు తిరిగి లాభాల బాట పడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలు వస్తున్నాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ ఏకీకృత నికర లాభంలో ఏకంగా 149 శాతం పెరిగి రూ. 371 కోట్లకు చేరింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ. 149 కోట్లుగానే ఉండేది. సేల్స్ పెరగడమే దీనికి కారణంగా విశ్లేషిస్తున్నారు. అదానీకి చెందిన ఈ రెనివబుల్ పవర్ సంస్థ మొత్తం ఆదాయం 54 శాతం మేర పెరిగి రూ. 2589 కోట్లకు చేరింది. ఏడాది కిందట ఇది రూ. 1107 కోట్లుగా ఉంది. ఇక అదానీ గ్రీన్ ఎనర్జీ మొత్తం ఖర్చులు 43 శాతం పెరిగి రూ. 2160 కోట్లుగా నమోదైంది. అంతకుముందు చూస్తే ఇది రూ. 1514 కోట్లుగా ఉంది. తమ బృందం నిరంతర కృషి ఫలితంగానే అదానీ గ్రీన్ ఎనర్జీ మెరుగైన ప్రదర్శన చేసిందని చెప్పారు ఈ సంస్థ సీఈఓ అమిత్ సింగ్. ఈ క్రమంలోనే మరో అరుదైన మైలురాయిని చేరుకునేందుకు శ్రమిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద క్లస్టర్‌ను గుజరాత్‌లోని ఖావ్డాలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో మొత్తం ఎనర్జీ సేల్స్ 87 శాతం పుంజుకొని 5737 మిలియన్ యూనిట్లకు చేరింది. సోలార్ ఎనర్జీ సేల్స్ 11 శాతం పెరిగి 2576 మిలియన్ యూనిట్లకు పెరిగింది.

# భారీగా పెరిగిన వడ్డీ రేట్లు..



బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇటీవలి కాలంలో మంచి రిటర్న్లు వస్తున్న సంగతి తెలిసిందే. ఆర్‌బీఐ రెపో రేట్లను పెంచుతున్న కొద్దీ.. బ్యాంకులు పై ఆకర్షణీయ స్థాయిలో వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తున్నాయి. ఇప్పుడు ఒక బ్యాంక్ ఒక్కసారిగా డిపాజిట్లపై వడ్డీ రేట్లను భారీగా పెంచింది. అక్టోబర్ 28 నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. రూ. 2 కోట్లకు లోబడిన బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు స్పష్టం చేసింది. బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం చూస్తే.. ఈ నిర్ణయం అక్టోబర్ 28నే అమల్లోకి వచ్చింది. ఇప్పుడు పెంచిన వడ్డీ రేట్ల ప్రకారం.. 7 రోజుల నుంచి 10 సంవత్సరాల టెన్యూర్లపై ఇది సాధారణ ప్రజలకు 3 శాతం నుంచి గరిష్టంగా 8.61 శాతం వడ్డీ ఆఫర్ చేస్తుండగా.. ఇదే సీనియర్ సిటిజెన్లకు 3.60 శాతం నుంచి అత్యధికంగా 9.21 శాతం ఇస్తోంది. ఇక్కడే సాధారణ ప్రజలతో పోలిస్తే సీనియర్ సిటిజెన్లకు అదనంగా 60 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ లభిస్తుండటం విశేషం. సీనియర్ సిటిజెన్లకు 9.21 శాతం, సాధారణ ప్రజలకు 8.61 శాతం ఎక్కువగా ఆఫర్ చేసే వడ్డీ ప్రస్తుతం 750 రోజుల టెన్యూర్ ఉన్న డిపాజిట్లపై అందిస్తోంది ఫిన్‌కేర్ బ్యాంకు. ఈ మేరకు బ్యాంక్ తన ట్విట్టర్ హ్యాండిల్‌లో కూడా పేర్కొంది. ఈ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను ఆన్‌లైన్‌లో ఎలా తెరవాలో ఒక లింక్ కూడా ఇచ్చింది. సవరించిన తర్వాత.. ఇప్పుడు బ్యాంక్ 7-14 రోజుల వ్యవధి ఉన్న డిపాజిట్లపై 3 శాతం వడ్డీ అందిస్తోంది. 15 రోజుల నుంచి 30 రోజుల టెన్యూర్డ్ డిపాజిట్లపై ఈ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు 4.50 శాతం వడ్డీ ఇస్తోంది. 31-45 రోజుల వ్యవధి డిపాజిట్లపై 5.25 శాతం, ఇదే 46 రోజుల నుంచి 90 రోజుల టెన్యూర్డ్ డిపాజిట్లపై ఇప్పుడు 5.76 శాతం వడ్డీ ఇస్తోంది. 500 రోజుల టెన్యూర్ ఉండే డిపాజిట్లపై 8.21 శాతం వడ్డీ అందిస్తుండటం విశేషం. 7 రోజుల నుంచి 84 నెలల వ్యవధి ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇప్పుడు ఫిన్‌కేర్ బ్యాంకు.. అత్యధిక మొత్తంలో వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఇది 3.60 శాతం నుంచి గరిష్టంగా 9.21 శాతం వరకు వస్తోంది. ఇక ఇప్పుడు కొత్త విషయం ఏంటంటే.. ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు విలీనం కానున్నాయి. దీనికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం కూడా లభించింది.

# ఇన్వెస్టర్లూ బీ రెడీ..


ఈ వారం ప్రాథమిక మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు 7 కంపెనీలు తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) కు రానున్నాయి. ఇందులో ప్రధాన విభాగంతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీ విభాగానికి చెందినవి ఉన్నాయి. అందులో సెల్లో వరల్డ్ రూ.1900 కోట్లు సమీకరించనుంది.
స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లూ బీ రెడీ. ఈ వారం ప్రాథమిక మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు 7 కంపెనీలు ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నాయి. ఇందులో ప్రధాన విభాగంతో పాటు ఎస్ఎంఈ విభాగానికి చెందినవి ఉన్నాయి. ఒక షేరు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కానుంది. మార్కెట్లో ఒడుదొడుకులున్నా గత వారం బ్లూ జెట్ హెల్త్ కేర్ ఐపీఓకు మంచి స్పందన లభించింది. రాబోయే నెలల్లోనే ఇదే జోరు కొనసాగనుందేనే అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే నడుస్తున్న పారగాన్ ఫైన్ అండ్ స్పెషాలిటీ కెమికల్స్ ఐపీఓ నేడు అక్టోబర్ 30న ముగియనుంది. శాంతలా ఎఫ్ఎంసీజీ ప్రోడక్ట్స్, కేకే షా హాస్పిటల్స్ ఐపీఓలు 31న మైత్రేయ మెడికేర్ ఐపీఓ నవంబర్ 1న ముగియనున్నాయి. ఈ వారం వచ్చే 7 ప్రధాన ఐపీఓలు ఓసారి పరిశీలిద్దాం.





సెల్లో వరల్డ్.. స్టేషనరీ ఉత్పత్తుల సంస్థ సెల్లో వరల్డ్ ఐపీఓ సోమవారం అక్టోబంర్ 30న ప్రారంభమైంది. నవంబర్ 1న ముగియనుంది. ధరల శ్రేణి రూ.617 నుంచి రూ. 648 గా నిర్ణయించారు. ఇష్యూకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ. 567 కోట్లు సమీకరించనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తంగా రూ.1900 కోట్లు సమీకరించనుంది. హొనాసా కన్స్యూమర్.. మామాఎర్త్, డెర్మా బ్రాండ్లపై ఉత్పత్తులు విక్రయించే హొనాసా కన్స్యూమర్ ఐపీఓ ఈనెల 31న ప్రారంభం కానుంది. నవంబర్ 2న ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.308 నుంచి రూ. 324గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ. 1701 కోట్లు సమీకరించనుంది. వీటితో పాటు ఎస్ఎంఈ విభాగంలో ట్రాన్స్ స్టీల్ సీటింగ్ ఐపీ ధరల శ్రేణి రూ. 67 నుంచి రూ.70 మధ్య ఉండగా.. వృందావన్ ప్లాంటేషన్ ఐపీఓ ధరల శ్రేణి రూ. 108గా నిర్ణయించారు. ఈ ఐపీఓలు సోమవారం అక్టోబర్ 30న ప్రారంభమై నవంబర్ 1న ముగియనున్నాయి. మిష్ డిజైన్స్ ఒక్కో షేరు రూ.122గా నిర్ణయిం చగా.. ఈ ఐపీఓ అక్టోబర్ 31న మొదలై 2వ తేదీన ముగుస్తుంది. ఎస్ఈఆర్ టెలీవెంచర్ ఐపీఓ ధరల శ్రేణి రూ.52 నుంచి రూ. 55 మధ్య ఉండగా.. ఇది నవంబర్ 1న మొద లై 3వ తేదీన ముగుస్తుంది. ఆ తర్వాత బాబా ఫుడ్ ప్రాసెసింగ్ ఐపీ ఇది నవం బర్ 3న ప్రారంభమై నవంబర్ 7న ముగుస్తుంది. రాజ్ గార్ క్యాస్టర్ డెరివేటివ్స్ షేరు, ఎన్ ఎస్ఈ, ఎస్ఎంఈ ప్లాట్ ఫామ్స్ పై ఈనెల 31న నమోదు కానుంది.

# ఈ అకౌంట్లు ఆన్‌లైన్‌లో ఎలా ఓపెన్ చేయాలంటే?




కేంద్ర ప్రభుత్వం ఎన్నో రకాల పొదుపు పథకాలను ఆఫర్ చేస్తోంది. వీటిల్లో చాలా వరకు పోస్టాఫీస్‌లో తెరిచేందుకు అనువుగా కూడా ఉంటాయి. ఇప్పుడు పోస్టల్ డిపార్ట్‌మెంట్.. వీటిల్లో మంత్లీ ఇన్‌కం స్కీమ్, సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్, మహిళా సమ్మాన్ పథకాల్ని ఆన్‌లైన్‌లో తెరిచేందుకు అవకాశం కల్పించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ (పోస్టల్ విభాగం) ఇటీవల పలు కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఒక కొత్త సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, సీనియర్ సిటిజెన్స్ స్కీమ్, పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్‌కం పథకం వంటి వాటిని ఆన్‌లైన్‌లో కూడా తెరిచేందుకు అవకాశం తీసుకొచ్చింది. వీటిని ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఫెసిలిటీ ద్వారా ఆన్‌లైన్‌లో ఓపెన్ చేయొచ్చని ప్రకటించింది. 2023, అక్టోబర్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఆఫ్ పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ కస్టమర్స్ దాంట్లో జనరల్ సర్వీసెస్ ట్యాబ్‌ను క్లిక్ చేయడం ద్వారా.. స్కీమ్స్‌లో అకౌంట్లు తెరవొచ్చని స్పష్టం చేసింది. ఈ మేరకు అక్టోబర్ 26న ఒక ప్రకటన విడుదల చేసింది. త్వరలో ఆన్‌లైన్‌లో ఈ పథకాల్ని క్లోజ్ చేసే సదుపాయం కూడా అందుబాటులోకి రానున్నట్లు స్పష్టం చేసింది. ఈ స్కీమ్స్‌ను ఆన్‌లైన్‌లో ఎలా ఓపెన్ చేయాలో తెలుసుకుందాం. మొదటగా జనరల్ సర్వీసెస్ ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. తర్వాత సర్వీస్ రిక్వెస్ట్స్‌పై క్లిక్ చేయాల్సి ఉంటుంది.అక్కడ న్యూ రిక్వెస్ట్స్‌ను సెలక్ట్ చేసుకొని.. బటన్‌పై నొక్కాలి. లేదా స్కీమ్ ఏదైతే అది ఎంచుకోవాలి. తర్వాతి స్టెప్‌లో మీరు డిపాజిట్ చేసే నగదు మొత్తాన్ని ఎంటర్ చేయాలి. ఇది స్కీం నియమ నిబంధనలకు లోబడి ఉండాలి. తర్వాత డెబిట్ అకౌంట్‌ను యాడ్ చేయాలి. ఇది పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్‌కు లింక్ అయి ఉండాలి. అవసరమైతే ట్రాన్సాక్షన్స్ రిమార్క్స్ ఎంటర్ చేయాలి. తర్వాత టర్మ్స్ అండ్ కండీషన్స్ చెక్ బాక్స్ టిక్ చేసి.. క్లిక్ హియర్‌పై క్లిక్ చేయాలి. తర్వాత సబ్మిట్ ఆన్‌లైన్‌పై నొక్కాలి. తర్వాత ట్రాన్సాక్షన్ పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. తర్వాత సబ్మిట్ బటన్ నొక్కాలి. అన్నీ సరిగ్గా ఉంటే అకౌంట్ ఓపెన్ అవుతుంది. డౌన్‌లోన్ రిసిప్ట్‌ను చూడొచ్చు. డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక ఇంటర్నెట్ బ్యాంకింగ్ యూజర్లు.. పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్, సుకన్య సమృద్ధి యోజన మినహాయించి అన్ని పథకాల్ని ఓపెన్ చేసేందుకు అవకాశం ఉంది.

ఉత్తేజిత దినపత్రిక

# నందికొట్కూరు రథసప్తమి వేడుకలో ఎమ్మెల్యే గిత్త జయ సూర్య

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 4 :**



నందికొట్కూరు పట్టణంలోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం పురోహితులు సురేష్ త్రినాథరావు ప్రకారం, ఉదయం ఆరాధన, మంగళాశాసనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను రాతి రథంలో ప్రతిష్టించి అభిషేకం, విశేష ఆరాధన చేపట్టారు. అనంతరం, శ్రీ స్వామివారి రాతి రథంపై నిత్య కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి తిరువీధి మహోత్సవం వైభవంగా , కన్నుల పండువగా సాగింది. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ఎస్ బేబీ టిపిఓ రంగస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు సందర్భంగా ఆలయం కమిటీ సభ్యులు వారికి మర్యాదగా కలిసి దుశ్శాల్వతో సన్మానాలు చేసినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలుగు ప్రజలకు రథసప్తమి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి రాష్ట్ర పండుగగా రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసామన్నారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు కల్పిస్తున్నారని, ఆదిత్యుడి దర్శనం కోసం సోమవారం రాత్రి నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారని దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయన్నారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాలతో పట్టణానికి కొత్త శోభ వచ్చిందని అన్నారు. ఆరోగ్య ప్రదాత దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారన్నారు. ఆలయం అభివృద్ధికి చర్యలు చేపట్టామని అని అన్నారు సూర్య భగవానుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని వారు ఆకాంక్షించారు. ప్రాచీన దేవాలయాలను కాపాడుకోవాలి అన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. నందికొట్కూరు చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా కార్యక్రమం చేయాలనే ఆలోచనతో పకడ్బంధిగా చేశామని చెప్పారు. సూర్యనారాయణ స్వామి నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ప్రభుత్వ చేసిన ఏర్పాట్లపై వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి కన్వీనర్ భాస్కర్ రెడ్డి, పలుచని మహేశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ముర్తుజావలి,కౌన్సిలర్లు, పట్టణ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

# నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలలో గుండె పోటు రోగులకు అత్యవసర చికిత్స

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 4:**



గుండె పోటు రోగులకు అత్యవసర చికిత్స ఉచితంగా మన నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలోఛాతీ నొప్పి, ఆయాసం, స్పృహ కోల్పోవడం గుండె దడ వంటి లక్షణాలతో వచ్చిన రోగులకు ఈ సి జి ద్వారా గుండెపోటును గుర్తించి అత్యవసరమైన ఇంజెక్షన్ టెనెక్టిప్లేస్ ను ఇవ్వడం ద్వారా వారి ప్రాణాలను రక్షించడం జరిగిందని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నందికొట్కూరు పట్టణంలో ప్రభుత్వ వైద్యశాలలో అధునాతన వైద్యాన్ని పేద ప్రజలకు అందిస్తున్నామని అన్నారు ఆర్థిక స్తోమత లేని వారికి అన్ని రకాల వైద్య సేవలు వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. నలభై వేల రూపాయల విలువగల ఇంజెక్షన్ టెనెక్టిప్లీస్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచితంగా ప్రజల కొరకు అందుబాటులోకి తీసుకొచ్చింది అని పేర్కొన్నారు. ఇప్పటివరకు
మన నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 21 మంది గుండె పోటు రోగులకు ఇంజెక్షన్ టెనెక్టిప్లీస్ ను ఇచ్చి వారి ప్రాణాలను రక్షించడం జరిగిందని తెలిపారు. ఇంజెక్షన్ ఇచ్చిన తరువాత రోగులను కార్డియాలజీ విభాగం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి అంజియో గ్రామ్ మరియు మరిన్ని పరీక్షల నిమిత్తం అంబ్యులెన్స్ ద్వారా పంపడం జరిగింది పేర్కొన్నారు. కావున నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలకి ఎవరికైనా పై లక్షణాలు ఉన్నచో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించగలరు వారు తెలిపారు

# నంద్యాల శనగ - 857 పంట క్షేత్ర దినోత్సవం

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 4:**




ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల 'ప్రిన్సిపల్ సైంటిస్ట్'డా. ఎ. రామకృష్ణా రావ్, డా. ఎస్. నీలిమ, డా. పి. చైతన్య,
ఎ.డి.ఎ., సి. విజయ శేఖర్ మరియు మండల వ్యవసాయ అధికారి, పి . షేక్ షావలి సంయుక్తంగా మంగళవారం నందికొట్కూరు మండలంలో " కోళ్ల బాపురం " గ్రామంలో నంద్యాల సెనగ 857' (ఎన్ . బి.ఇ.జి.857) 'క్షేత్ర దినోత్సవ%శీ%' నిర్వహించడం జరిగినది.
'గిరిజన ఉప ప్రణాళిక' లో భాగంగా 'షెడ్యూల్డ్ ట్రైబ్' రైతుల 15 ఎకరాలలో 'నంద్యాల సెనగ 857' (ఎన్ . బి.ఇ.జి.857) రకాన్ని రబీ 2024-25 పంట కాలంలో సాగు చేయించడం జరిగినది.
ప్రస్తుతం శనగ పంట పంటకోత దశలో మరియు గింజ ఏర్పడిదశలో ఉన్నట్లు గమనించడం జరిగినది.
ఈ క్షేత్ర త్ర దినోత్సవం లో శాస్త్రవేత్తలు రైతులకు నంద్యాల సెనగ 857' (ఎన్ . బి.ఇ.జి.857) రకంలో మొక్కకు సుమారుగా 80 నుంచి 90 కాయలు వచ్చినట్లు, రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నటువంటి శనగరకం జె . జి. 11 రకం లో కేవలం 30 నుంచి 40 కాయలు మాత్రమే ఉన్నట్లు రైతులకు చూపించడం జరిగినది.
నంద్యాల సెనగ 857' (ఎన్ . బి.ఇ.జి.857) రకం 'ఎండు తెగులు' ను సమర్థవంతంగా తట్టుకొని ఎకరానికి సుమారుగా 8 నుంచి 10 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని రైతులకు తెలియజేశారు.
కాబట్టి రైతులు శనగ పంట లో జె.జి.- 11 రకానికి ప్రత్యామ్నాయంగా 'నంద్యాల సెనగ రకాలను' సాగు చేసుకోవాలని రైతులకు సూచించడం జరిగింది. నంద్యాల శనగ రకాల" గురించి"రైతు సేవ కేంద్రాల" ద్వార తెలియ చేయాలని డాక్టర్ ఏ రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్, మండల వ్యవసాయ అధికారిని మరియు ఏ.డీ.ఏ. ని కోరారు. క్షేత్ర త్ర దినోత్సవం తర్వాత వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం లో భాగంగా మినుము మరియు శనగ పంట లను సందర్శించి ఆ పంటలలో ఆశించే పురుగులు తెగులు నివారణ గురించి రైతులకు శాస్త్రవేత్తలు వివరంగా వివరించడం జరిగినది.

# సూర్యప్రభవాహనంపై శ్రీ మన్నారాయణుడి అభయం

**తిరుమలలో వైభవంగా రథసప్తమి**

**తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, ఫిబ్రవరి 04.**




సూర్య జయంతిని పురస్కరించుకుని మంగళవారంనాడు తిరుమలలో రథసప్తమి ఉత్సవాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. ప్రతి ఏటా మాఘ శుద్ధ సప్తమినాడు ఈ ఉత్సవాన్ని తిరుమలలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఒకే రోజున శ్రీమలయప్ప స్వామివారు సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై అనుగ్రహించడం విశేషం. ఈ కారణంగా ఈ ఉత్సవాన్ని అర్ధ బ్రహ్మోత్సవం, మినీ బ్రహ్మోత్సవం, ఒకరోజు బ్రహ్మోత్సవంగా పిలుస్తుంటారు. రథసప్తమి పర్వదినాన్ని తిరుమలలో క్రీ.శ 1564 నుండి జరుపుతున్నట్లుగా శాసనాధారాలు ఉన్నాయి. సూర్యోదయం నుండి చంద్రోదయం వరకు వివిధ వాహనాలపై స్వామివారిని వేంచేపు చేస్తారు.

సూర్యప్రభ వాహనం (ఉదయం 5.30 నుండి 8 గంటల వరకు) :అత్యంత ప్రధానమైన రథసప్తమి వాహనసేవ సూర్యప్రభవాహనం. సర్వలోకాలకు చైతన్యాన్ని కలిగిస్తూ ఉదయించే శ్రీ సూర్య భగవానుడు తన ఉషారేఖలను ఉదయం 6.48 గంటలకు శ్రీవారి పాదాలపై ప్రసరించి అంజలి ఘటించాడు. ఈ వాహనసేవ అపురూప దృశ్యాన్ని తిలకించేందుకు ఉదయాత్పూర్వం నుండి ఎంతో ఆసక్తితో నిరీక్షిస్తున్న వేలాది మంది భక్తిపారవశ్యంతో పులకించారు. భక్తుల గోవిందనామస్మరణ మధ్య స్వామివారి వాహనసేవ వైభవంగా జరిగింది.

ఆయురారోగ్యప్రాప్తి :
సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడు. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.

ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ శ్రీ బి.ఆర్ నాయుడు, ఈవో శ్రీ శ్యామలరావు, అడిషనల్ ఈఓ శ్రీ వెంకయ్య చౌదరి , పాలక మండలి సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ, శ్రీ ఎమ్మెస్ రాజు, శ్రీమతి పనబాక లక్ష్మి, శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, శ్రీ భాను ప్రకాష్ రెడ్డి, శ్రీ ఎన్. సదాశివరావు,
శ్రీమతి సుచిత్ర ఎల్లా, శ్రీ నరేష్ , శ్రీ శాంతా రామ్ , శ్రీ రాజశేఖర్ గౌడ్ , శ్రీమతి రంగశ్రీ , శ్రీమతి జానకి దేవి , %యవశీ% శ్రీ వీర బ్రహ్మం , ఎస్పీ శ్రీ హర్షవర్ధన్ రాజు , %జుూా% శ్రీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యారాధన

**ఉత్తేజిత (శ్రీశైలం ప్రతినిధి)**





ఫిబ్రవరి 4వ తేదీన శ్రీశైలం మహా క్షేత్రంలో రథసప్తమి మాఘ శుద్ధ సప్తమిపర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో సూర్యారాధన జరిపించబడింది
ఈ కార్యక్రమానికి ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు జరగకుండా ఉండాలనీ, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, అన్ని సామాజిక వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు లోక కల్యాణ సంకల్పాన్ని చెప్పడం జరిగింది.
తరువాత కలశస్థాపనచేసి కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడింది. అనంతరం వైదికాచార్యులు ఆయా బీజమంత్రాలతోనూ, ప్రత్యేక ముద్రలతోనూ సూర్యనమస్కారాలు చేసారు ఈ కార్యక్రమంలో భాగంగానే సూర్యయంత్ర పూజ, వేదపారాయణలు, అరుణపారాయణ, జరిపించబడ్డాయి. అనంతరం సూర్యభగవానుడికి ఉత్తరపూజనము షోడశోపచారపూజ నివేదన, మంత్రపుష్పము జరిపించబడ్డాయి
కాగా మన పురాణాలలో ఈ సూర్యారాధన ఎంతో విశేషంగా చెప్పబడింది. సూర్యారాధన వల్ల అనారోగ్యం తొలగి ఆరోగ్యం చేకూరుతుందని పురాణాలు చెబుతున్నాయి. ముఖ్యంగా రథసప్తమి రోజున సూర్యుని ఆరాధించడం ఎంతో ఫలదాయకం
మన్వంతర ప్రారంభంలో సూర్యభగవానుడు మాఘశుద్ధ సప్తమి రోజున మొట్టమొదటిసారిగా తన ప్రకాశాన్ని లోకాలకు అందించాడని చెబుతారు. అందుకే రథసప్తమి రోజును సూర్యజయంతిగా జరుపుకోవడం ఆచారంగా కొనసాగుతోంది.
ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. శ్రీనివాసరావు దంపతులు, అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

# వాహనల్లో సిరులతల్లి అభయం

**తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి, ఫిబ్రవరి 04**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం భానుని రేఖలు సూర్యప్రభ వాహనంలో కొలువైన అమ్మవారిపై ప్రసరించడాన్ని భక్తులు దర్శించుకుని ఆనందపరవశులయ్యారు. ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు అమ్మవారు హంస, అశ్వ, గరుడ, చిన్నశేష వాహనాలపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 3.30 నుండి 4.30 గంటల వరకు స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంలతో అమ్మవారిని విశేషంగా అభిషేకించారు. సాయంత్రం 6 గంటల నుండి అమ్మవారు చంద్రప్రభ, గజ వాహనంపై దర్శనమివ్వనున్నారు.
శ్రీ సూర్యనారాయణస్వామివారి ఆలయంలో ... తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసూర్యనారాయణస్వామివారి ఆలయంలో ఉదయం 6 గంటలకు స్వామివారు అశ్వవాహనాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచారపరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల బృందాల కోలాటాలు, చెక్కభజనలు, భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ గోవింద రాజన్, ఏఈవో శ్రీ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీ రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ సుభాష్ ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ గా టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం పొందినట్లు ప్రకటించిన జెసి మరియు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఫిబ్రవరి04:**



నిన్నటి సోమవారం నాడు తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ డిప్యూటీ మేయర్ ఎన్నికకు నిర్వహించిన ప్రత్యేక సమావేశం నందు కోరం లేనందున వాయిదా పడిన నేపథ్యంలో నేడు మంగళవారం ఉదయం 11 గం. నుండి ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాల్ నందు నిర్వహించిన తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రత్యేక సమావేశంలో 47 మంది పాల్గొనగా మున్సిపల్ కౌన్సిల్ డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ఆర్సీ మునికృష్ణకు 26 మంది చేతులు ఎత్తి తమ మద్దతు తెలుపగా వైఎస్ఆర్సీపీ పార్టీ అభ్యర్థి టీ.భాస్కర్ రెడ్డికి 21 మంది చేతులు ఎత్తి మద్దతు పలుకగా మెజారిటీ సాధించిన టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం సాధించినట్లు జెసి మరియు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ విజేతగా ప్రకటించారు. ఇందులో ఎంపీ గురుమూర్తి, ఎంఎల్ఏ ఆరని శ్రీనివాసులు ఎక్స్ అఫిషియో సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సహకరించిన కార్పొరేటర్లలందరికి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, పోలీస్ యంత్రాంగానికి, మున్సిపాల్ సిబ్బందికి,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు జెసి మరియు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

**04-02-2025 తేదీన కర్నూలు ఎస్పీ కార్యాలయం నందు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే & PAC సభ్యులు డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) విక్రాంత్ పాటిల్ (IPS) గారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.**



ఉత్తేజిత దినపత్రిక



# ఒక్కరోజే 20 శాతం పెరిగిన స్టాక్..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం సెషన్లో తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడవుతున్నాయి. లాభాల్లోనే ఉన్నప్పటికీ.. ఒక్కసారిగా పెరిగి మళ్లీ వెంటనే పడిపోతున్నాయి. సెన్సెక్స్ ప్రస్తుతం ఉదయం 11.30 గంటల సమయంలో. 250 పాయింట్లు, నిఫ్టీ 100 పాయింట్ల లాభంలో కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని స్టాక్స్ భారీగా దూసుకెళ్తున్నాయి. ఒక స్టాక్ %ు%3 ఫలితాల నేపథ్యంలో 20 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది.

హితాచి ఎనర్జీ ఇండియా లిమిటెడ్ స్టాక్ అదరగొడుతోంది. ఇన్వెస్టర్లకు కాసుల పంట పండిస్తోంది. 5 శాతం, 10 శాతం కాదు.. ఒక్కరోజే ఏకంగా 20 శాతం దూసుకెళ్లింది. అప్పర్ సర్క్యూట్లో లాకైంది. మళ్లీ మామూలుగా పెరగలేదు. 20 శాతం అంటే ఒక్కో షేరుపై %చీజు% లో ఏకంగా రూ. 2046.25 పెరగడం విశేషం. కిందటి సెషన్లో రూ. 10,231.25 వద్ద ముగిసిన స్టాక్.. ఇవాళ ఆరంభంలోనే 10 శాతానికిపైగా లాభంతో రూ. 11,444 వద్ద ఓపెన్ అయింది. అక్కడితో ఆగకుండా మళ్లీ దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే కిందటి సెషన్ క్లోజింగ్ నుంచి 20 శాతం పెరిగి చివరకు రూ. 12,277.50 వద్ద అప్పర్ సర్క్యూట్లో లాకైంది. కిందటి రోజు కూడా ఈ స్టాక్ పెరిగింది. 2 రోజుల వ్యవధిలోనే స్టాక్ ధర ఏకంగా 27 శాతానికిపైగా ఎగబాకింది. దీంతో ఇందులో పెట్టుబడులు పెట్టిన వారికి కాసుల వర్షం కురిసింది. భారీగా లాభాలు ఆర్జించారు.

2024-25 ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి ఈ కంపెనీ ఫలితాల్ని బుధవారం రోజు ప్రకటించింది. ఇక్కడ ఇది దలాల్ స్ట్రీట్ అంచనాల్ని అధిగమించి పెర్ఫామెన్స్ చేయడం విశేషం. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే కంపెనీ నికర లాభం క్యూ3లో 498 శాతం మేర పెరిగి రూ. 137.4 కోట్లుగా నమోదైంది. ఇదే సమయంలో కిందటి త్రైమాసికంతో (జులై-సెప్టెంబర్) పోలిస్తే 162.7 శాతం పెరిగింది. క్యూ2లో కంపెనీ లాభం రూ. 52.3 కోట్లుగా ఉంది. ఇక ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 31 శాతం మేర పెరిగి రూ. 1672.4 కోట్లకు చేరుకుంది. మూడో త్రైమాసికంలో ఎబిటా రూ. 168.9 కోట్లుగా ఉంది. రికార్డు స్థాయిలో తొలిసారి ఒక త్రైమాసికంలో అత్యధిక విలువతో ఆర్డర్లను అందుకుంది. క్యూ3లో ఈ కంపెనీ ఆర్డర్స్ వాల్యూ రూ. 11,594.3 కోట్లుగా ఉంది. ఖవ్డా (గుజరాత్) నుంచి నాగ్‌పూర్ (మహారాష్ట్ర) వరకు ట్రాన్స్‌మిట్టింగ్ రెనివబుల్ ఎనర్జీ కోసం లార్జ్ హై వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ ఆర్డర్ విలువ పరంగా అతిపెద్దది కావడం ప్రధాన కారణం.

ఈ స్టాక్ 52 వారాల గరిష్ట విలువ రూ. 16,549.95 గా ఉండగా.. కనిష్ట ధర రూ. 5590 గా ఉంది. ఇక కంపెనీ మార్కెట్ విలువ రూ. 52.03 వేల కోట్లు. గత 5 రోజుల్లో చూస్తే ఈ స్టాక్ 4 శాతానికిపైగా పెరగ్గా.. నెల రోజుల్లో 14 శాతం పతనమైంది. 6 నెలల్లో 3 శాతం పుంజుకోగా.. ఇదే సమయంలో ఏడాది వ్యవధిలో 118 శాతం పుంజుకుంది. గత ఐదేళ్లలో ఇది 81 వేల శాతానికిపైగా పెరిగింది. బడ్జెట్‌కు ముందు దేశీయ స్టా మార్కెట్ సూచీలు గురువారం రోజు ఒడుదొడుకుల్లో ట్రేడవుతున్నాయి. వార్త రాసే సమయంలో సెన్సెక్స్ 250 పాయింట్ల లాభంతో 76,780 లెవెల్స్‌లో ఉంది. నిఫ్టీ 100 పాయింట్లు పుంజుకొని 23,260 లెవెల్స్‌లో కొనసాగుతోంది.

# ఒక్కరోజే 20 శాతం కుప్పకూలిన స్టాక్..




భారత స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం సెషన్లో లాభాల్లోనే ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ 400 పాయింట్లు, నిఫ్టీ 70 పాయింట్లకుపైగా పెరిగినప్పటికీ.. చాలా వరకు స్టాక్స్ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ క్రమం లోనే ఒక ప్రముఖ కంపెనీ స్టాక్ ఏకంగా 20 శాతం పడిపోయింది. దీంతో ఇందులో ఇన్వెస్ట్ చేసిన వారికి భారీగా నష్టాలు వస్తున్నాయని చెప్పొచ్చు.

గత కొద్ది సెషన్లుగా తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడయిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ఇవాళ (మంగళవారం) కోలుకున్నాయని చెప్పొచ్చు. ఎట్టకేలకు ఇవాళ లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఈ వార్త రాసే సమయంలో (ఉదయం 11 గంటలకు) బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 400 పాయింట్ల లాభంతో 75,760 మార్కు వద్ద కొనసాగుతోంది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ విషయానికి వస్తే.. 70 పాయింట్ల లాభంతో 22,900 మార్కు వద్ద ఉంది. స్టాక్ మార్కెట్లు కిందటి సెషన్‌తో పోలిస్తే కోలుకున్నప్పటికీ.. చాలా స్టాక్స్ ఇంకా భారీగా ఇన్వెస్టర్లకు నష్టాల్ని ఇస్తూనే ఉన్నాయి. వీటిల్లో కొన్ని స్టాక్స్.. ఒక్కరోజులో 5 శాతం, 10 శాతం, 20 శాతం ఇలా చాలా లోయర్ సర్క్యూట్లు కొట్టాయి.

ఇప్పుడు మనం ఒక్కరోజులోనే 20 శాతం పడిపోయిన స్టాక్ గురించి తెలుసుకుందాం. అదే కేన్స్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ స్టాక్. కిందటి సెషన్లో ఇది రూ. 5268.05 వద్ద ముగియగా.. ఇవాళ భారీ నష్టాల్లోనే ప్రారంభమైంది. క్రమక్రమంగా పడుతూ వస్తూ.. ఇంట్రాడేలో ఏకంగా 20 శాతం నష్టంతో రూ. 4214.45 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం 19.70 శాతం నష్టంతో (ఒక్కో షేరుపై రూ. 1038 తగ్గి) రూ. 4230 వద్ద ట్రేడవుతోంది. ఈ క్రమంలోనే ఈ స్టాక్‌లో ఇన్వెస్ట్ చేసిన వారిని తీవ్ర నష్టాలు వెంటాడుతున్నాయి. కిందటి రోజు కూడా ఈ స్టాక్ పడిపోగా.. 2 రోజుల వ్యవధిలోనే 25 శాతం వరకు పతనం కావడం గమనార్హం.

ఈ కంపెనీ తాజాగా అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికం ఫలితాల సందర్భంగా.. ఆదాయ వృద్ధి అంచనాల్ని తగ్గించడమే దెబ్బతీసింది. అంతకుముందు ఆదాయం రూ. 3 వేల కోట్లుగా అంచనా వేయగా.. ఇప్పుడు దానిని తగ్గించి రూ. 2800 కోట్లకు చేర్చింది. డిసెంబర్ క్వార్టర్‌లో ఈ కంపెనీ చాలా వరకు ఆర్డర్లను పూర్తి చేయలేకపోయిందని.. వీటి విలువ సుమారు రూ. 100 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. అది ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో పూర్తి చేయొచ్చని భావిస్తోంది. ఈ క్రమంలోనే ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినగా.. అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో స్టాక్ పతనం అవుతోంది.

మూడో త్రైమాసికంలో ఈ కంపెనీ నికర లాభం.. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 47 శాతం పెరిగి రూ. 66.5 కోట్లుగా నమోదైంది. ఇక ఆదాయం కూడా 30 శాతం మేర పెరిగి రూ. 661.2 కోట్లుగా వచ్చింది. అంతకుముందు ఇది రూ. 509.3 కోట్లుగానే ఉండేది. లాభాదాయాలు పెరిగినప్పటికీ.. ఆదాయ వృద్ధి అంచనాలు తగ్గించడంతో పెద్ద దెబ్బ పడ్డట్లయింది. ఇక ఈ కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 27.17 వేల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 7822 కాగా.. కనిష్ట ధర రూ. 2424గా ఉంది.

# ఒకేసారి చేతికి రూ. 5.80 కోట్లు.. నెలకు రూ. 10 వేల పొదుపుతో సాధ్యం..

మ్యూచువల్ ఫండ్స్‌లో అప్పుడప్పుడు అద్భుతాలు జరుగుతుంటాయి. ఇక్కడ కాంపౌండింగ్ ఎఫెక్ట్‌తో దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ సాధించొచ్చని నిపుణులు చెబుతుంటారు. ఇంకొన్ని సార్లు మాత్రం ఊహించని రీతిలో భారీగా సంపాదించొచ్చు. ఇప్పుడు ఒక స్కీమ్ అదే విధంగా మ్యాజిక్ చేసింది. రూ. 10 వేల సిప్‌ను కొన్నేళ్లలోనే ఏకంగా కోట్లుగా మలిచింది.

దిగ్గజ మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో ఒకటైన కెనరా రాబెకో ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ స్కీమ్ 32 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఇది ఓపెన్ ఎండెడ్ హైబ్రిడ్ స్కీమ్ అని చెప్పొచ్చు. ఇది ఎక్కువగా ఈక్విటీ అండ్ ఈక్విటీ రిలేటెడ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీ, డెట్ ఇన్వెస్ట్‌మెంట్లను బ్యాలెన్స్ చేసుకుంటూ పెట్టుబడులు పెడితే.. దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందుకునే విధంగా ఈ ఫండ్ తీసుకొచ్చింది. ఈ కారణంతోనే ఇన్వెస్టర్లకు కచ్చితత్వంతో కూడిన లాభాలు అందించడమే లక్ష్యంగా, ఈక్విటీ, డెట్ ఇలా వైవిధ్యతతో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని.. తద్వారా రిస్క్ తక్కువగా ఉంటుందని తాజాగా ఫండ్.. ప్రెస్ రిలీజ్‌లో వివరాల్ని వెల్లడించింది.

కెనరా రాబెకో ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ అనేది అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్. ఈక్విటీల్లో పెట్టుబడుల ద్వారా లాంగ్ రన్‌లో మంచి రాబడి అందించేందుకు ఉద్దేశించింది. 1993, ఫిబ్రవరి 1న ఈ స్కీమ్ లాంచ్ అయింది. ఇక్కడ పథకానికి కొలమానంగా ఉంది. ఈ ఫండ్ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ అంటే నికర ఆస్తుల విలువ 2024, డిసెంబర్ 31 వరకు చూస్తే రూ. 10,747.36 కోట్లుగా ఉంది.

ఇక రిటర్న్స్ విషయానికి వస్తే ఈ ఫండ్ గత ఏడాది, మూడేళ్లు, ఐదేళ్ల వ్యవధిలో చూసినట్లయితే సగటున వరుసగా 15.23 శాతం, 11.91 శాతం, 15.53 శాతం చొప్పున



ప్రతిఫలం వచ్చింది. ఇదే సమయంలో ఇక్కడ బెంచ్‌మార్క్ క్రిసిల్ హైబ్రిడ్ 35ం65- అగ్రెసివ్ ఇండెక్స్ రిటర్న్స్ వరుసగా 12.69, 11.85, 14.59 శాతంగా ఉంది.

స్కీమ్ లాంచింగ్ నుంచి చూస్తే ఈ కెనరా రాబెకో ఫండ్ సగటున 11.74 శాతం మేర రిటర్న్స్ అందించింది. అంటే పథకం ప్రారంభించిన సమయంలో ఇందులో ఎవరైనా ఇన్వెస్టర్ రూ .10 వేలు ఇన్వెస్ట్ చేసినట్లయితే ఇప్పుడు అది రూ. 3.46 లక్షలకు చేరేది. అదే సమయంలో ప్రారంభం నుంచి ప్రతి నెలా రూ. 10 వేల చొప్పున సిప్ విధానంలో పెట్టుబడి పెట్టినట్లయితే మొత్తం పెట్టుబడి 2024, డిసెంబర్ 31 వరకు రూ. 38.30 లక్షలు కాగా.. ఇది 13.90 శాతం సగటు రాబడి కింద ఏకంగా రూ. 5.80 కోట్లకు చేరేది. అంటే 10 వేల చొప్పున సిప్ చేస్తే.. కోట్లల్లో రాబడి వచ్చిందన్నమాట. 1993లో ప్రారంభిస్తే అంటే 32 ఏళ్లలో ఇలా జరిగింది. మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులతో దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ వస్తాయనడానికి ఇదే సాక్ష్యం. ఓపిక ఉంటేనే మంచి ఫలితాలు అందుకోవచ్చు. ఈ స్కీమ్ ఈక్విటీ పోర్షన్ మేనేజర్లుగా శ్రీదత్తా భండ్వాల్దర్, ఎన్నెట్టే ఫెర్నాండెస్ ఉండగా.. డెట్ పోర్షన్‌కు సంబంధించి అవ్నీశ్ జైన్ ఉన్నారు.

# ఈ పేమెంట్స్ చేయలేరు..

ఇకపై ట్రాన్సాక్షన్ ఐడీలో స్పెషల్ క్యారెక్టర్స్ ఉంటే ఆ యూపీఐ ట్రాన్సాక్షన్ ఐడీలను యూపీఐ సెంట్రల్ సిస్టమ్ అనుమతించదని స్పష్టం చేసింది ఎన్‌పీసీఐ. 2025, ఫిబ్రవరి 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని వివరించింది.

ఈ విషయం దృష్టిలో పెట్టుకోవాలని తాజాగా.. యూపీఐ వ్యవస్థలో భాగస్వామ్యం అయిన అన్ని డిజిటల్ పేమెంట్స్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలకు తెలిపింది. ఇకపై కేవలం అల్ఫాన్యూమరిక్ ట్రాన్సాక్షన్ ఐడీలను మాత్రమే తాము అనుమతిస్తామని.. అదే సమయంలో స్పెషల్ క్యారెక్టర్స్ కలిగి ఉంటే ఆ ట్రాన్సాక్షన్స్ డిక్లైన్ (తిరస్కరణ) అవుతాయని వెల్లడించింది. యూపీఐ పేమెంట్స్ చేసేందుకు ప్రస్తుతం ఎక్కువగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వాడుతున్నప్పటికీ.. ఇంకా చాలానే యాప్స్ ఉంటాయి. క్రెడ్, ఫ్రీఛార్జ్, నవీ, వన్‌కార్డ్, బజాజ్ ఫిన్‌సర్వ్, ధని, బిగ్‌క్యాష్ వీటితో పాటుగా పలు బ్యాంకులు ప్రత్యేకంగా పేమెంట్ యాప్స్ తీసుకొచ్చాయి. వీటన్నింటిలోనూ ఇదే రూల్ వర్తిస్తుంది. ఇదే సమయంలో కొద్ది మంది మినహా దాదాపు అందరు భాగస్వాములు కొత్త నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేసినట్లు పేర్కొంది. ఈ మార్పుతో యూపీఐ యూజర్లకు భద్రత పెరుగుతుందని.. వ్యవస్థ మరింత మెరుగ్గా తయారవుతుందని తెలిపింది. యూపీఐ ట్రాన్సాక్షన్స్ విలువ ప్రతి నెలా పెరుగుతూ పోతున్న సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబర్ నెలలో యూపీఐ ట్రాన్సాక్షన్స్ సంఖ్య ఏకంగా 16.73 బిలియన్లకు చేరుకుంది. దానికి ముందటి నెల కంటే ఇది 8 శాతం ఎక్కువ. విలువ పరంగా రూ. 23.25 లక్షల కోట్లకుపైనే ఉంటుంది.

# భర్త కిడ్నీని రూ.10 లక్షలకు అమ్మేసి.. డబ్బు తీసుకుని ప్రియుడితో పారిపోయిన భార్య

భార్యాభర్తలు అంటే పెళ్లి అయిన క్షణం నుంచి ప్రాణం పోయే వరకు కలిసి ఉండే బంధం. కానీ కొందరు చేస్తున్న పనులు.. ఆ బంధానికే కళంకం తెచ్చేలా ఉంటున్నాయి. భర్త కిడ్నీని అమ్మేసిన ఓ భార్య.. వచ్చిన డబ్బుతో తన ప్రియుడితో కలిసి పారిపోయిన సంఘటన ఇప్పుడు తీవ్ర విమర్శలకు కారణం అవుతోంది. కుమార్తె పై చదువుల కోసం కిడ్నీ అమ్మేద్దామని భర్తను నమ్మించిన భార్య.. రూ.10 లక్షలకు విక్రయించింది. వచ్చిన డబ్బును తీసుకుని.. తన లవర్‌తో వెళ్లిపోయింది. వారిద్దరినీ దొరకబట్టినా.. ఆమె మనసు కరగలేదు.

భర్త కిడ్నీని రూ.10 లక్షలకు అమ్మేసి.. డబ్బు తీసుకుని ప్రియుడితో పారిపోయిన భార్య

పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో సమాజం సిగ్గుతో తలదించుకునే ఘటన ఒకటి చోటు చేసుకుంది. తాళి కట్టిన భర్త ప్రాణాలనే ఫణంగా పెట్టిన ఓ భార్య.. అతడి కిడ్నీని విక్రయించి.. వచ్చిన డబ్బుతో లవర్‌తో వెళ్లిపోయింది.

భర్తను బలవంతపెట్టి కిడ్నీని అమ్మేలా ఒత్తిడి తీసుకువచ్చిన ఆ భార్య.. వచ్చిన డబ్బుతో తన కుమార్తెను మంచి చదువులు చదివించుకుందామని చెప్పింది. అయితే తన భార్య చెప్పిన విషయాలన్నీ గుడ్డిగా నమ్మిన ఆ అమాయక భర్త.. కిడ్నీని ఇచ్చేశాడు. ఆ కిడ్నీ అమ్మగా.. రూ.10 లక్షలు వచ్చాయి. ఆ డబ్బు తీసుకువచ్చిన తర్వాత రాత్రి ఎవరికీ తెలియకుండా ఆ రూ.10 లక్షలు తీసుకుని.. ప్రియుడితో కలిసి పారిపోయింది. అయితే అసలు విషయం బయటపడిన తర్వాత ఆ భర్త.. వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారికి 10 ఏళ్ల కుమార్తె ఉంది. ఇక భార్య, ఆమె లవర్ ఆచూకీ తెలిసి అక్కడికి వెళ్లగా.. వారి ముందే గడియపెట్టేసుకుని వెళ్లగొట్టింది.

హౌరా జిల్లాలోని సంక్రైల్‌లో జరిగిన ఈ ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. బాధితుడికి 10 ఏళ్ల కుమార్తె ఉండగా.. అతడు సంపాదించే ఆదాయం ఆమె చదువుకు అయ్యే ఖర్చులకు సరిపోలేదు. దీంతో అతడి కిడ్నీ అమ్మేస్తే.. కుమార్తె చదువుతోపాటు కుటుంబ ఆర్థిక సమస్యలు కూడా తీరుతాయని భార్య నమ్మించింది. కుమార్తె భవిష్యత్ నాశనం అయితే అందుకు బాధ్యత అతడిదే అని ఆ భార్య నిత్యం ఘర్షణ పడుతూనే ఉండేది.

అయితే ఆమె అంత ఒత్తిడి ఎందుకు చేస్తుందో ఆ భర్త కనిపెట్టలేకపోయాడు. చివరికి తన కూతురి భవిష్యత్తును ఆలోచించి కిడ్నీ అమ్మేసేందుకు అంగీకరించాడు. దీంతో నెలరోజుల పాటు కిడ్నీని అమ్మేందుకు భార్యాభర్తలు వెతికారు.

చివరికి ఆ భర్త కిడ్నీ.. రూ. 10 లక్షలకు అమ్ముడుపోయింది. ఇద్దరూ కలిసి కిడ్నీ కొనే వ్యక్తి వద్దకు వెళ్లి డబ్బు తీసుకుని వచ్చారు. ఆ డబ్బును తన వద్దే పెట్టుకున్న భార్య.. ఉదయాన్నే బ్యాంకులో డిపాజిట్ చేద్దామని నమ్మించింది. కానీ అదేరోజు రాత్రి.. ఇంటి నుంచి ఆమె పారిపోయింది. కొన్ని రోజుల తర్వాత శుక్రవారం తన భార్య బరాక్‌పూర్‌లోని సుభాష్ కాలనీలో రవిదాస్ అనే వ్యక్తితో నివసిస్తున్నట్లు భర్తకు తెలిసింది. ఈ క్రమంలోనే తన కుమార్తెతో కలిసి అక్కడికి చేరుకున్న భర్తను చూసిన ఆ భార్య షాక్ అయింది.

వారిని చూసి ఇంట్లోకి వెళ్లి తలుపు గడియపెట్టుకుంది. డబ్బులు ఇవ్వను.. ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించింది. అంతేకాకుండా విడాకులు పంపిస్తానని బ్లాక్ మెయిల్ చేసింది. కనీసం తన 10 ఏళ్ల కుమార్తెను చూసి కూడా ఆమెపై జాలి చూపించలేకపోయింది. దీంతో తన భార్య, ఆమెతో కలిసి ఉంటున్న పెయింటర్ రవిదాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశాడు.



# అయోధ్య సమీపంలో దళిత యువతి హత్యాచారంపై ఎంపీ కన్నీరు

దళిత యువతిని దారుణంగా అత్యాచారం చేసి.. హత్య చేసిన ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ఎంపీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. దళిత యువతిపై హత్యాచారం ఘటన నేపథ్యంలో సీతారాములు ఎక్కడ ఉన్నారని.. మీరు ఎక్కడ ఉన్నారంటూ మీడియా సమావేశంలోనే కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇక ఈ ఘటనలో దళిత యువతి కుటుంబానికి న్యాయం జరగకపోతే.. తాను ఎంపీ పదవికి రాజీనామా చేస్తారని తెలిపారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫైజాబాద్ నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికైన అవధేష్ ప్రసాద్ మీడియా సమావేశంలోనే కన్నీరు పెట్టుకున్నారు. 22 ఏళ్ల దళిత యువతిపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి.. దారుణంగా చంపిన ఘటనపై ఆయన తీవ్ర భావోద్వేగం అయ్యారు. ఆ యువతి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆమెకు న్యాయం జరగకపోతే ఎంపీ పదవీకి రాజీనామా చేస్తానని మీడియా సమావేశంలోనే పేర్కొన్నారు. ఇక అవధేష్ ప్రసాద్ మీడియా సమావేశంలోనే ఏడ్చిన వీడియోలు వైరల్ అవుతున్నాయి.

అయోధ్య జిల్లాలో జరిగిన ఈ ఘటన నేపథ్యంలో ఆడ పిల్లలను కాపాడుకోవడంలో మనం విఫలం అవుతున్నామని ఈ సందర్భంగా అవధేష్ ప్రసాద్ వెల్లడించారు. ఈ క్రమంలోనే "మర్యాద పురుషోత్తమ రామ, సీతా మాత మీరు ఎక్కడ ఉన్నారు..?" అంటూ మీడియా ముందే రోదించారు. అయోధ్యలోని మిల్కిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరగడానికి కొన్ని రోజుల ముందు ఈ ఘటన చోటు చేసుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందు ఈ అంశాన్ని లేవనెత్తుతానని అవధేష్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ ఘటనలో న్యాయం జరగకపోతే తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. ఇటీవల అయోధ్య జిల్లాలోని ఒక కాలువలో 22 ఏళ్ల యువతి మృతదేహం కనిపించింది. గురువారం రాత్రి ఒక మతపరమైన కార్యక్రమానికి వెళ్లిన ఆ యువతి ఇంటికి తిరిగి రాలేదని బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ తమ ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఆ తర్వాత కాలువలో దొరికిన మృతదేహం దుస్తులు లేకుండా, శరీరంపై గాయాలు కనిపించాయని గుర్తించారు. ఆమెను తాళ్లతో కట్టేశారని ఆమె కుటుంబ సభ్యులు

> అయోధ్య జిల్లాలోని కాలువలో 22 ఏళ్ల యువతి మృతదేహం కనిపించింది. గురువారం రాత్రి ఒక మతపరమైన కార్యక్రమానికి వెళ్లిన ఆ యువతి ఇంటికి తిరిగి రాలేదని బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ తర్వాత కాలువలో దొరికిన మృతదేహం దుస్తులు లేకుండా, శరీరంపై గాయాలు కనిపించాయని గుర్తించారు.

ఆరోపించారు. ఆ యువతిపై అత్యాచారం, హత్య జరిగిందని నిర్ధారించారు. మిల్కీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గతంలో గెలిచిన అవధేష్ ప్రసాద్.. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఫైజాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అనంతరం మిల్కిపూర్ ఎమ్మెల్యే పదవికి అవధేష్ ప్రసాద్ రాజీనామా చేశారు. ఈనెల 5వ తేదీన మిల్కీపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రసిద్ధ అయోధ్య రామమందిరం నిర్మించిన తర్వాత కూడా ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఓటమిపాలైంది.



# మరోసారి అంబానీ కుటుంబం గొప్పమనసు..

దేశంలో అనేక సేవా కార్యక్రమాలు, దాతృత్వ సేవలు అందిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్.. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలోనూ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మహా కుంభమేళాకు వచ్చే లక్షల మంది భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తోంది. ఇందుకోసం రిలయన్స్ సంస్థకు చెందిన వాలంటీర్లు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. "వి కేర్" ఫిలాసఫీ కింద రిలయన్స్ సంస్థ ఈ కార్యక్రమాలు మొదలుపెట్టింది. ఇలాంటి ఆధ్యాత్మిక సమ్మేళనానికి వచ్చే భక్తులకు సేవ చేస్తే దేవుడి అనుగ్రహం లభిస్తుందని విశ్వసిస్తారు.

మహా కుంభమేళాకు వచ్చే లక్షలాది భక్తుల కోసం రిలయన్స్ సంస్థ సేవా కార్యక్రమాలు చేపట్టింది. భక్తుల కోసం ఆహారం, వాహనాలు, విశ్రాంతి ప్రాంతాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతేకాకుండా కుంభమేళాకు వచ్చే భక్తుల కోసం ఆహారం అందిస్తోంది. కుంభమేళాలో భక్తులు తప్పిపోకుండా ఏర్పాట్లు చేసింది. ఇక వైద్య సేవలను కూడా నిర్వహిస్తోంది. సెల్ సిగ్నల్స్‌లో అంతరాయం లేకుండా రిలయన్స్ సంస్థ అన్ని చర్యలు చేపట్టింది.

మహా కుంభమేళాకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం భోజనం, వాహనాలు, రెస్ట్ తీసుకోవడానికి గుడారాలను రిలయన్స్ సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. మహా కుంభమేళాకు వచ్చే యాత్రికులకు తమ సేవలు ఉంటాయని.. రిలయన్స్ సంస్థ డైరెక్టర్ అనంత్ అంబానీ పేర్కొన్నారు. మహా కుంభమేళా అనేది జీవిత కాల అవకాశం అని.. ఇక్కడికి వచ్చే లక్షలాది మంది భక్తుల ఆరోగ్యం, సంక్షేమం, రక్షణకు సహాయపడే అవకాశం తమకు లభించిందని అనంత్ అంబానీ వెల్లడించారు. ఇప్పటికే అన్నసేవ పేరుతో రిలయన్స్ కుంభమేళాలో భక్తులకు ఆహారం అందిస్తోంది.

ఇవే కాకుండా భక్తుల ఆరోగ్యం కోసం కూడా రిలయన్స్ సంస్థ పలు సేవలు చేస్తోంది. వైద్యసేవల కింద ఓపీడీ, డెంటల్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. మహిళలకు ప్రత్యేకంగా అవసరమైన చికిత్సలను సిద్ధంగా ఉంచింది. అంతేకాకుండా ప్రయాగ్‌రాజ్ నుంచి త్రివేణి సంగమం వద్దకు భక్తులు చేరుకునేందుకు వీలుగా వాహనాలను కూడా నడిపిస్తోంది. మరోవైపు.. ప్రయాగ్‌రాజ్ జిల్లా యంత్రాంగంతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేపడుతోంది. త్రివేణి సంగమంలో ఎమర్జెన్సీ సమయంలో ఉపయోగించేందుకు లైఫ్ జాకెట్లు, బోట్లకు అవసరమైన ఏర్పాట్లను కూడా రిలయన్స్ చేసింది. కంపా ఆశ్రమ్స్ పేరిట రిలయన్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ రెస్ట్ జోన్లను మహా కుంభమేళాలో నిర్వహిస్తోంది. మరోవైపు.. మహా కుంభమేళాకు వచ్చిన భక్తులు తప్పిపోకుండా ఉండేందుకు ఎటు వైపు వెళ్తే ఏ మార్గం వస్తుందో తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేసింది.

ఇక సెల్‌ఫోన్ సిగ్నల్స్‌లో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా బీటీఎస్‌లు, ట్రాన్స్‌పోర్ట్ టవర్లను కూడా రిలయన్స్ ఏర్పాటు చేసింది. కీలకమైన ప్రాంతాల్లో కొత్త ఆప్టికల్ ఫైబర్ లైన్లను కూడా వేసింది. మహా కుంభమేళాలో విధులు నిర్వహించే పోలీసులకు నీటి సౌకర్యాలు, వాచ్ టవర్లు, బారికేడ్లను సమకూర్చింది. ఈ మొత్తం సేవలను భక్తుల వరకు చేర్చేందుకు ద్వారకలోని శారదా పీఠం, శంకరాచార్య ఉత్సవ్ సేవాలయా ఫౌండేషన్, నిరంజని అఖాడా, ప్రభు ప్రేమ్ సంగ్ ఛారిటబుల్ ట్రస్ట్, పరమార్థ్ నికేతన్ ఆశ్రమంతో కలిసి రిలయన్స్ సంస్థలు పనిచేస్తోంది.

# మీ అబ్బాయికి ఈ పేరు పెడితే మహారాజే

మన దేశాన్ని ఎందరో మహారాజులు పాలించారు. భారతదేశం ఒకప్పుడు అనేక సామ్రాజ్యాల సమూహం. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు దేశంలోని అనేక ప్రాంతాలను తమ రాజధానులుగా చేసుకొని పరిపాలన సాగించారు. మీరు కూడా చాలా మంది ధైర్యవంతులు, వీరులైన రాజుల కథలను వినే ఉంటారు. ఎంతోమంది రాజులు, యోధులు మన దేశం గర్వించేలా పాలన చేశారు. మీ అబ్బాయికి భారతదేశంలోని గొప్ప రాజుల పేరు పెట్టాలనుకుంటే.. మీరు సరైన చోటుకు వచ్చారు. భారతదేశం గర్వించదగ్గ పాలన చేసిన గొప్ప రాజుల పేర్లు మీ కోసమే. అశోక చక్రవర్తి గురించి ఎవరికి తెలియదు చెప్పండి? అశోకుడు భారతదేశ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడారు. అశోకుడు బౌద్ధమత వ్యాప్తికి కృషిచేస్తూనే పరిపాలన పట్ల శ్రద్ధవహించాడు. మీ అబ్బాయికి గొప్ప పాలకుడైన అశోక పేరు పెట్టవచ్చు. దేవధర్మం అనే పేరు మీద దేవ్ అని పెట్టవచ్చు. దేవధర్మం మౌర్య సామ్రాజ్యం 7వ చక్రవర్తి. దేవధర్మం నీతిమంతుడు, న్యాయవంతుడు, శక్తివంతుడు, దయగలవాడు.

మీరు మీ అబ్బాయికి ముస్లిం పేరు కోసం చూస్తున్నట్లయితే, జహంగీర్ అనే పేరు బాగుంటుంది. ఈ రోజుల్లో ఇలాంటి పౌరాణిక పేర్లు బాగా నచ్చుతున్నాయి. జహంగీర్ 1605 నుంచి 1627 వరకు భారతదేశాన్ని పాలించాడు. జహంగీర్ అంటే ప్రపంచం మొత్తాన్ని పాలించేవాడు అనే అర్థం వస్తుంది. మీ అబ్బాయికి జై అనే పేరు చాలా బాగుంటుంది. క్రీ.శ.641 నుంచి 673 వరకు జయసింహ రాజు భారతదేశాన్ని పరిపాలించాడు. జై పేరు అంటే విజేత అని అర్థం వస్తుంది. మీ అబ్బాయి పేరు 'మా'తో మొదలవ్వాలంటే.. మాధవ్ అనే పేరు నప్పుతుంది. శ్రీకృష్ణుడిని మాధవ అని కూడా పిలుస్తారు. పీష్వా మాధవరావు క్రీ.శ.1774 నుంచి క్రీ.శ.1795 వరకు పరిపాలించాడు. మాధవ అంటే తేనె వంటి మధురమైనది.





ఉత్తర భారతదేశంలో చివరి భాగంలో ఈ రాజు పేరు చాలా ప్రసిద్ధి గాంచింది. పృథ్వీరాజ్ చౌహన్ ధైర్యానికి మారు పేరు. ఈయన సుమారు 1177లో సింహాసనాన్ని అధిష్టించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. పృథ్వీరాజ్ అనే పేరు మీ అబ్బాయికి చాలా బాగుంటుంది. మీ అబ్బాయికి మహారాజ్ విక్రమాదిత్య పేరు కూడా పెట్టొచ్చు. ఈ పేరును కుదించి విక్రమ్ పేరును ఎంచుకోవచ్చు. విక్రమాదిత్యుడు క్రీ.శ.655 నుంచి 680 వరకు పరిపాలించాడు. విక్రమ్ అనే పేరు శౌర్యానికి చిహ్నం అని అర్థం. హర్షవర్ధనుడు భరతమాత మేటి పుత్రులలో ఒకడైన భారతదేశ చక్రవర్తి. హర్షవర్ధనుడు మహా చక్రవర్తి, ధీర వీర సైన్యధిపతి, సహిత్య కాలాభిమాని, నాటక కర్త మహనీయ, గుణసంపన్నుడు, ఆకర్షనీయమైన వ్యక్తి. మీ అబ్బాయికి హర్షవర్ధన్ అనే పేరు చాలా బాగుంటుంది.





# బరువు తగ్గాలని రాత్రి పూట తింటున్నారా..



ఇడ్లీ, దోశ అనగానే చాలా మంది ఉదయాన్నే తింటారు. అయితే, రాత్రి హెవీగా తినకుండా కొంతమంది వీటిని తింటారు. ఇలా తినడం మంచిదేనా తెలుసుకోండి. సాధారణంగా, ఇడ్లీ, దోశలను పులియబెట్టిన పిండితో చేస్తారు. అయితే, పులియబెట్టిన ఫుడ్స్ జీర్ణశక్తికి మంచివే. మరి వీటిని రాత్రి తీసుకోవడం మంచిదేనా తెలుసుకోండి. దీని వల్ల నిజంగా బరువు తగ్గుతారా.. రాత్రుళ్ళు తింటే బరువు తగ్గుతారా.. ఏం జరుగుతుంది. ఎవరు వీటిని తీసుకోకూడదు. పూర్తి వివరాలు తెలుసుకోండి.

పులియబెట్టిన ఫుడ్స్ జీర్ణశక్తిని పెంచి పేగు ఆరోగ్యాన్ని, జీర్ణాశయంలో మంచి బ్యాక్టీరియా ఉత్పత్తిని పెంచుతాయి. వీటి వల్ల ఇమ్యూనిటీ కూడా పెరుగుతుంది. వీటిలో ఎక్కువగా పీచు పదార్థాలు ఉంటాయి. అయితే, ఉదయాన్నే తీసుకోవడం మంచిదే. కానీ, రాత్రి తీసుకోవడం అంత మంచిది కాదు. ఇండియాలోని ప్రముఖ డైటీషియన్లలో డాక్టర్ డింపెజుంగడా తన ఇన్‌స్టాగ్రామ్ పేజ్ వేదికగా వీడియోను పోస్ట్ చేశారు. అందులో రాత్రి ఈ పులియబెట్టిన ఫుడ్స్ తీసుకోవద్దని చెబుతున్నారు. ముఖ్యంగా కొంతమంది తీసుకోకపోవడమే మంచిది.



సాధారణంగా గర్భిణీలు, పాలిచ్చేవారు కూడా రాత్రుళ్ళు పులియబెట్టిన ఆహారాన్ని తీసుకోకూడదు. గర్భధారణ సమయంలో కడుపు అసౌకర్యంగా ఉంటుంది. పెరుగు, పనీర్ వంటి వాటికి దూరంగా ఉండాలి. అదే విధంగా, పాలిచ్చే తల్లులు దూరంగా ఉండాలి. ఎందుకంటే, తల్లికి కడుపునొప్పికి వస్తే పిల్లలకి కూడా వస్తుంది. బీపి ఉన్నవారు.. సాధారణంగా పులియబెట్టిన ఆహారాల్లో ఎక్కువగా ఉప్పు ఉంటుంది. అలాంటప్పుడు రక్తపోటు ఉన్నవారు వీటిని తీసుకోకపోవడమే మంచిది. వీటిని తతీసుకోవడం వల్ల రక్తపోటు అందుబాటులో ఉంటుంది. ఇతర అనారోగ్య సమస్యల్ని తగ్గించవచ్చు. కొందరు తరచుగా ఫుడ్ అలర్జీలతో బాధపడతారు. అలాంటి వారు రాత్రి పూట వీటిని తీసుకోవకపమేవడమే మంచిది. అలాంటి వారు ఈ ఫుడ్స్ తీసుకుంటే అజీర్ణం, తలనొప్పి వంటి సమస్యలతో బాదపడతారు. కొంతమందికి జీర్ణ సమస్యలు ఉంటాయి. ముఖ్యంగా అసిడిటీ, కడుపు ఉబ్బరం ఉన్నవారు రాత్రుళ్ళు పులియబెట్టిన ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. దోశ, ఇడ్లీ, కడుపు నొప్పి, ఉబ్బరం వంటి సమస్యల్ని కలిగిస్తాయి. కాబట్టి, జీర్ణ సమస్యలు ఉన్నవారు దోశ, ఇడ్లీలను తీసుకోవకపోవడమే మంచిది. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం.

# త్వరగా బరువు తగ్గుతారు

కలబందలో మేలైన ఔషధ మొక్క. సాధారణంగా కలబందను సౌందర్య ఉత్పత్తుల తయారీకి, కేశ సంరక్షణకు ఎక్కువగా వాడుతుంటాం. దీనిలో ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. కలబందలో విటమిన్ ఎ, సి, ఇ, బి1, బి2, బి3, బి6, బి12, ఫోలిక్ యాసిడ్, 18 రకాల అమైనో యాసిడ్స్, కాల్షియం, క్రోమియం, సెలెనియం, మెగ్నీషియం, జింక్, సోడియం, ఇనుము, పొటాసియం, కాపర్, మాంగనీస్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. కలబంద బరువు తగ్గించడానికీ సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కలబందలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని టాక్సిన్స్‌ని బయటకు పంపి, శరీరాన్ని శుభ్రపరుస్తాయి. శరీరంలో టాక్సిన్స్ తొలగితే.. జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేస్తుంది, పోషకాలను గ్రహిస్తుంది. ఈ ప్రక్రియ త్వరగా బరువు తగ్గడానికి తోడ్పడుతోంది. మీరు బరువు తగ్గాలనుకుంటే.. కలబందను ఎలా తీసుకోవాలో ఈ స్టోరీలో చూసేయండి.

నిమ్మతో ఇలా తీసుకోండి.. రెండు చెంచాల కలబందని ఒక గ్లాసు నీళ్లలో, మూడుచెంచాల నిమ్మరసంతో కలిపి రోజూ ఉదయం పరగడుపున తీసుకోవాలి. ఇది తాగాక గంట వరకూ ఇంకేమీ తీసుకోకూడదు. అలా చేస్తే శరీరంలో ఉన్న మలినాలు తొలగిపోతాయి. పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఇది తాగితే త్వరితగతిన ఉపశమనం పొందవచ్చు. రోజూ ఒక గ్లాసు నీటిలో రెండు చెంచాల కలబంద రసాన్ని మాత్రమే తీసుకోవాలి. ఎక్కువగా తీసుకుంటే దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

అల్లం, కలబంద కలిపి తీసుకుంటే.. సులభంగా బరువు తగ్గవచ్చని నిపుణులు చెబుతున్నారు. మీరు వెయిట్ లాస్ అవ్వాలనుకుంటే.. కలబంద గుజ్జుని అల్లంతో కలిపి రోజూ ఒక గ్లాసు మధ్యాహ్నం పూట తీసుకోండి. అల్లంలోని యాంటీ బ్యాక్టీరియా గుణాలు ఒత్తిడిని అదుపుచేస్తాయి. జీర్ణవ్యవస్థను మెరుగుపరిచి శరీరంలో తేమ నిల్వ ఉండేలా చేస్తాయి. ఈ గుణాలన్నీ కలబందతో కలిసినప్పుడు శరీరంలోని కొవ్వును సులభంగా కరిగిస్తాయి.






కమలా, స్ట్రాబెర్రీతో.. స్ట్రాబెర్రీలో యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని మలినాలను తొలగిస్తాయి. కమలాలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇదీ శరీరంలో కొవ్వు త్వరగా కరిగేలా సహాయపడుతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే.. కమలా రసంతో, కలబంద గుజ్జు, స్ట్రాబెర్రీ కలిపి తీసుకోండి. ఈ జ్యూస్ షుగర్ పేషెంట్స్ కూడా తీసుకోవచ్చు.



# మొటిమల సమస్యకు చెక్



పెసర పప్పు మన ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో సహాయపడుతుంది. ఆయుర్వేదంలో పెసర పప్పును.. 'క్వీన్ ఆఫ్ పల్సెస్ అని అంటారు. పెసర పప్పులో ప్రోటీన్, పొటాషియం, ఐరన్, విటమిన్–బి6, నియాసిన్, ఫోలేట్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలో ఫ్లేవనాయిడ్‌లు, ఫినోలిక్ యాసిడ్స్, ఆర్గానిక్ యాసిడ్స్, అమైనో యాసిడ్స్, కార్బోహైడ్రేట్స్, లిపిడ్స్ వంటి పోషకాలు ఉన్నాయి. దీన్ని తరచు మన ఆహారంలో తీసుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. పెసర్ పప్పుతో.. ఆరోగ్య ప్రయోజనాలే కాదు.. సౌందర్యాన్ని రెంట్టింపు చేసే గుణాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. పెసర పప్పులో పప్పులో యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబయల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు చర్మసమస్యలను దూరం చేస్తాయి, మన అందాన్ని రక్షిస్తాయి. మీ బ్యూటీ కేర్‌లో పెసరపప్పు ఎలా యాడ్ చేసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం. ప్రకాశవంతమైన చర్మం పొందడానికి.. పొట్టు ఉన్న పెసర పప్పుని నాలుగు టీస్పూన్లు తీసుకుని రెండు గంటలు నానబెట్టి పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ఆరెంజ్ పీల్ పొడి, టీస్పూను గంధం పొడి వేసి మిక్స్ చేయాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా వేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత కొద్దిగా నీటితో తడిచేసి మర్దన చేసి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకుంటే ముఖం కాంతిమంతంగా, ప్రకాశవంతంగా మెరుస్తుంది.

డ్రై స్కిన్ ఉంటే.. మీరు డ్రై స్కిన్ కారణంగా బాధపడుతుంటే.. పెసరపప్పు ప్యాక్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. ఈ ప్యాక్ రెడీ చేసుకోవడానికి.. రాత్రంతా పెసరపప్పును పచ్చిపాలలో నానబెట్టండి. మరుసటి రోజు ఉదయం, నానబెట్టిన పప్పును గ్రైండ్ చేసి పేస్ట్ లా చేసి.. మీ ముఖానికి ప్యాక్‌లా అప్లై చేసుకోండి. దీన్ని 15 నిమిషాలపాటు ఆరనిచ్చి.. చల్లటి నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. ముఖం మృదువుగా మారుతుంది.

మొటిమలకు చెక్ పెట్టండి.. పెసరపప్పు.. చర్మంలోని రంధ్రాలలోని మురికి, నూనె తొలగిస్తుంది. మీరు మొటిమలు, బ్రేక్ అవుట్స్ సమస్యతో ఇబ్బంది పడుతుంటే.. ఈ ప్యాక్ కచ్చితంగా వేసుకోండి. మీరు చేయాల్సిందల్లా పెసరపప్పును రాత్రంతా నీళ్లలో నానబెట్టండి. మరుసటి ఉదయం పేస్ట్ చేసుకోండి. ఈ పేస్ట్‌లో కొద్దిగా నెయ్యి వేసి మిక్స్ చేయండి. ఈ పేస్ట్‌తో ముఖాన్ని సున్నితంగా మసాజ్ చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. మంచి రిజల్ట్స్ ఉంటాయి. ఫేషియల్ హెయిర్ తొలగుతుంది.. ఫేషియల్ హెయిర్ తొలగించడానికి.. ఈ పెసరపప్పు ప్యాక్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. మీరు ఫేషియల్ హెయిర్ తొలగించుకోవడానికి.. రాత్రంతా పెసరపప్పును నీళ్లలో నానబెట్టండి. మరుసటి రోజు ఉదయం దీన్ని పేస్ట్‌లా రుబ్బుకోండి. దీనిలో నారింజ తొక్కల పొడితో పాటు కొంచెం గంధపు పొడి వేసి మిక్స్ చేసుకోండి. దీనిలో కొంచెం పాలు కూడా వేసుకోవచ్చు. ఈ మిశ్రమంతో ముఖాన్ని మసాజ్ చేసుకోండి. వారానికి రెండు మూడు సార్లు ఇలా చేస్తే.. ఫేషియల్ హెయిర్ తొలగుతుంది.

టాన్ తొలగించండిలా.. సన్‌టాన్.. ఎక్కువగా ఇబ్బంది పెట్టే సౌందర్య సమస్యల్లో ఇదీ ఒక్కటీ. పెసరపప్పును రాత్రంతా నానబెట్టి, ఆపై పేస్ట్ లా రుబ్బుకోవాలి. పేస్ట్‌లో కొద్దిగా పెరుగు వేసి మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని టాన్ ఉన్న ప్రదేశాల్లో రాయండి. దీన్ని 15 నిమిషాల పాటు ఆరనిచ్చి చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోండి.

# జీర్ణ సమస్యలు దూరం అవుతాయి..!



క్రానిక్ ఇన్‌డైజషన్.. దీన్నే ఫంక్షనల్ డైస్పెప్సియా అని కూడా పిలుస్తారు. క్రానిక్ ఇన్‌డైజషన్ కారణంగా పొత్తికడుపు ఎగువభాగంలో నిరంతరం నొప్పి, అసౌకర్యంతో కూడిన జీర్ణ రుగ్మత వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీర్ఘకాలిక అజీర్తి వల్ల.. ఉబ్బరం, వికారం, కొంచెం తిన్నా కడుపు నిండిన భావన వంటి లక్షణాలూ ఉంటాయి. క్రానిక్ ఇన్‌డైజషన్ రావడానికి అనేక కారణాలు ఉంటాయి.. ఇది మల్టిఫ్యాక్టోరియల్ అని అంటారు. హెలికోబాక్టర్ పైలోరీ ఇన్ఫెక్షన్, అసాధారణ కడుపు చలనశీలత, కడుపులో యాసిడ్స్ ఎక్కువగా విడదల కావడం వంటి కారణాల వల్ల క్రానిక్ ఇన్‌డైజషన్ ఎదురయ్యే అవకాశం ఉంది. కొన్ని మూలికలు జీర్ణ సమస్యలకు చెక్ పెట్టడానికి, కడుపు సమస్యల నుంచి ఉపశమనం ఇవ్వడానికి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నా రు. ఈ మూలికలు కడపు ఉబ్బరం, వికారం వంటి లక్షణాలను తగ్గించడానికి సహాయపడతాయి. ఇవి క్రానిక్ ఇన్‌డైజషన్ రావడానికి అంతర్లీన కారణాలను పరిష్కరించకపోవచ్చు, కానీ దీని లక్షణాల నుంచి ఉపశమనం ఇస్తాయి. మీరు క్రానిక్ ఇన్‌డైజషన్‌తో బాధపడుతుంటే.. మీకు ఉపశమనం ఇవ్వడానికి పుదీనా ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. పుదీనా జీర్ణవాహిక కండరాలను సడలిస్తుంది, అజీర్తిని తగ్గిస్తుంది. పూదీనాను మీ వంటల్లో చేర్చుకోవచ్చు. దీన్ని హెర్బల్ టీ గా చేసుకుని తీసుకోవచ్చు. ఈ టిప్స్ ఫాలో అయితే.. టెన్షన్ తలనొప్పి మాయం..! అల్లం.. అల్లంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది వికారం తగ్గిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వంటలో తాజా అల్లం ఉపయోగించండి లేదా అల్లం టీ తయారు చేసుకుని తాగండి. చామంతి టీ.. విశ్రాంతిని ప్రోత్సహిస్తుంది. ఈ టీ తరచూ తాగితే.. అజీర్ణం, కడుపులో అసౌకర్యాన్ని దూరం చేస్తుంది. సోంపు.. సోంపు చాలా రుచిగా ఉండటమే కాదు ఔషధ గుణాలను కలిగి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. 100 గ్రాముల సోంపులో 40 గ్రా. పీచు ఉంటుంది. ఇది ఆహారం అరుగుదలకు తోడ్పడుతుంది. జీర్ణ సంబంధ సమస్యలతో బాధపడేవారు ఆహారం తీసుకున్న తర్వాత దీన్ని తింటే ఉపశమనం లభిస్తుంది.

# ఫేర్‌వెల్ పార్టీ నుంచి ఆరుగురు టెన్త్ స్టూడెంట్స్ అదృశ్యం..

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నెమలిపురి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆరుగురు పదో తరగతి విద్యార్థులు అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపింది. అయితే.. ఈ ఘటన విషయంలో రంగంలోకి దిగిన పోలీసులు.. ఆ ఆరుగురు విద్యార్థులు ఏపీలోని విజయవాడలో ఉన్నట్టు గుర్తించారు. దీంతో.. పోలీసులు హుటాహుటిన విజయవాడకు వెళ్లి ఆ ఆరుగురు పదో తరగతి విద్యార్థులను తీసుకొచ్చి.. వాళ్ల తల్లి దండ్రుల సమక్షంలోనే.. ఉపాధ్యాయులకు అప్పగించటంతో మిస్సింగ్ కేసు సుఖాంతమైంది.

స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్‌గా ఫేర్ వెల్ పార్టీ నిర్వహించారు. అందరూ హ్యాపీగా ఎంజాయ్ చేశారు. అయితే.. ఫేర్ వెల్ పార్టీ తర్వాత ఆరుగురు పదో తరగతి విద్యార్థులు కనిపించకుండా పోయింది. స్టూడెంట్స్ మిస్సింగ్ విషయం బయటికి తెలియటంతో.. సర్వత్రా కలకలం చెలరేగింది. కట్ చేస్తే.. ఆరుగురు విద్యార్థులు ఏపీలోని విజయవాడలో ప్రత్యక్షమయ్యారు. పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి.. ఆరుగురు స్టూడెంట్స్‌ని పాఠశాలకు క్షేమంగా తీసుకొచ్చారు. అసలు ఆ ఆరుగురు విద్యార్థులు అదృశ్యం కావటానికి అసలు కారణమేంటంటే..!

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట సమీపంలోని నెమలిపురి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో.. పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా ఫేర్ వెల్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో విద్యార్థులంతా హ్యాపీగా ఎంజాయ్ చేస్తుంటే.. మరోవైపు ఆరుగురు విద్యార్థులు మాత్రం.. పార్టీకి మద్యం సేవించి వచ్చారు. అక్కడితో ఆగకుండా.. పార్టీలో కాస్త ఓవరాక్షన్ చేశారు. తోటి విద్యార్థులతో గొడవ పెట్టుకున్నారు. ఈ గొడవ విషయం ఉపాధ్యాయులకు తెలియటంతో.. ఆ ఆరుగురు విద్యార్థులను మందలించారు.

పార్టీలో అందరిముందు మందలించటంతో.. తీవ్ర మనస్థాపానికి గురైన ఆరుగురు విద్యార్థులు పాఠశాల నుంచి అదృశ్యమయ్యారు. ఈ ఘటనపై భయాందోళనకు గురైన గురుకుల సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు, తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. దీంతో.. ఆ ఆరుగురు విద్యార్థులు విజయవాడకు వెళ్లినట్లు గుర్తించారు.

విద్యార్థుల ఆచూకీ గుర్తించిన పోలీసులు వెంటనే విజయవాడకు వెళ్లి.. ఆ ఆరుగురిని క్షేమంగా పాఠశాలకు తిరిగి తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. వారి మానసిక పరిస్థితిని మెరుగురపగప పర్చే చర్యలు చేపట్టారు. విద్యార్థులను తిరిగి ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సంరక్షణలో అప్పగించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పిల్లలు రక్షణ కోసం పాఠశాల యాజమాన్యం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# పార్టీని కొనేంత డబ్బు మా దగ్గర ఉంది



2028లో వచ్చేది బీసీల రాజ్యమేనని.. తెలంగాణకు చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అని కాంగ్రెస్ ఎమ్మెల్యే తీన్మార్ మల్లన్న సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీసీలే ఓనర్లనని.. తెల్లవారి సరికి బీఆర్ఎస్ పార్టీని కొనేంత డబ్బు బీసీల వద్ద ఉందని అన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాను రద్దు చేసి బీసీలకు సమాన అవకాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి కావటం ఖాయమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. రేవంత్ రెడ్డే చివరి ఓసీ సీఎం వ్యాఖ్యనించారు. ఆదివారం సాయంత్రం హనుమకొండ నిర్వహించిన 'బీసీ రాజకీయ యుద్ధభేరి' సభలో ఆయన పలు సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణకు బీసీలే ఓనర్లు అని.. బీసీల ఆర్థికంగా వెనకబడ్డారని అంటున్నారని అదేదీ నిజం కాదన్నారు. అవసరమైతే బీఆర్ఎస్ పార్టీని కొనేంత డబ్బు తమ (బీసీల) దగ్గర ఉందని అన్నారు. ఓసీ వర్గాల నుంచే ప్రస్తుతం 60మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, బీ ఫారం ఇవ్వని వారితో బీసీలకు ఇక యుద్ధమేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణలో EWS రిజర్వేషన్లు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వాన్నే రద్దు చేయాల్సిన పరిస్థితి కల్పిస్తామన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. తెలంగాణలో బీసీలీ 47 శాతం ఉన్నారని చెప్పేందుకు 90 ఏండ్లు పట్టిందన్నారు. కులాల లెక్కలు చెప్తే సరిపోదని... ఆ స్థాయిలో రిజర్వేషన్లు కూడా కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రద్దు చేసి బీసీలకు కూడా సమాన వాటా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2028 నుంచి తెలంగాణకు బీసీ వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉంటాడని చెప్పారు. బీసీ వర్గాలు ప్రతి ఏడాదికి రూ.1.20 లక్షల కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ చేస్తుంటే.. ప్రభుత్వం మాత్రం కేవలం రూ.9వేల కోట్లే కేటాయిస్తుందని ఫైరయ్యారు. రాబోయే అన్ని ఎన్నికల్లో బీసీలు పోటీ చేసి ఐక్యంగా ముందుకెళ్లాలని సూచించారు.

సభలో పాల్గొని ప్రసంగించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య.. బీసీ ఉద్యమం అంటే అల్లాటప్పా కాదని అన్నారు. బీసీల బతుకులు మార్చే మహా ఉద్యమమని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 50 ఏళ్లుగా బీసీ హక్కుల కోసం పోరాటం చేస్తున్నామని.. ఆనాడు జగన్నాథ రావు, హన్మంత రావు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలున్నప్పటికీ రాజకీయ కుట్రలతో తొక్కేశారన్నారు. బీసీలంతా తమ పోరాట పంథా మార్చుకొని.. తెలంగాణ కోసం కొట్లాడినట్లే రిజర్వేషన్ల కోసం కూడా పోరాడాలన్నారు. బీసీలంతా ఒక్కటే కులంగా కదలాలని పిలుపునిచ్చారు.

# ఉపఎన్నికల పోరుకు సిద్ధమవ్వండి..

**కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ మీద సోమవారం (ఫిబ్రవరి 03న) సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంలోనూ ఇదే వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌తో కలిపి విచారణ జరుపుతామని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది.**

తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య హాట్ హాట్‌గా విమర్శలు, ఆరోపణలు నడుస్తున్న నేపథ్యంలో.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేయటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలంతా.. ఉపఎన్నికలకు సిద్ధం కావాలని కేటీఆర్ ట్విట్టర్ వేదికగా పిలుపునిచ్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యలపై అనర్హత వేటు వేయాలంటూ.. కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. విచారణను ఈనెల 10వ తేదీకి వాయిదా వేసింది.

తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. తమ పార్టీ నాయకులు, కార్యక్రర్తలకు మరో కీలక పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలంతా ఉప ఎన్నికల పోరుకు సిద్ధం కావాలంటూ.. కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం (ఫిబ్రవరి 3న) కేటీఆర్ ట్వీట్ చేయటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. "సుప్రీంకోర్టు గత తీర్పులు చూస్తుంటే పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మీద వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది. ఫిరాయింపుదారులను కాంగ్రెస్ పార్టీ కాపాడడం సాధ్యమయ్యే పని కాదు." అంటూ కేటీఆర్ ట్వీట్‌లో చేశారు. అయితే.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో జంప్ అయిన ఎమ్మెల్యేల వ్యవహారంలో కేటీఆర్.. సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ మీద సోమవారం (ఫిబ్రవరి 03న) సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంలోనూ ఇదే వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌తో కలిపి విచారణ జరుపుతామని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది.

ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కాలయాపన చేస్తున్నారంటూ కేటీఆర్ సుప్రీంకోర్టులో జనవరి 29వ తేదీన రిట్ దాఖలు చేశారు. స్పీకర్ వెంటనే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు.

మరోవైపు.. ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ మీద ఇప్పటికే విచారణ నడుస్తోంది. ఈ క్రమంలో.. కౌశిక్ రెడ్డి వేసిన పిటిషన్‌తో పాటు తాజాగా కేటీఆర్ వేసిన పిటిషన్‌ను కలిపి 10వ తేదీన విచారించనున్నట్టు సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఫిరాయింపుదారుల మీద వేటు ఖాయమని.. ఉప ఎన్నికలకు సిద్ధం కావాలని గులాబీ కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునివ్వటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే.. పాడి కౌశిక్ రెడ్డి వేసిన పిటిషన్‌పై 2 రోజుల క్రితం సుప్రీం కోర్టులో విచారణ జరుగగా.. సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ స్పీకర్‌పై సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ ఆలస్యం చేయడాన్ని తప్పుపట్టింది. ఇంకా ఎంత సమయం కావాలంటూ గత విచారణలో గట్టిగా ప్రశ్నించింది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేదాకనా అంటూ గట్టిగానే ప్రశ్నించింది.



స్పీకర్‌కు ఎంత సమయం కావాలో కనుక్కుని చెప్పాలంటూ న్యాయవాది ముకుల్ రోహత్గీని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.

# అందరికీ తెలిసేలా కులగణన సర్వే వివరాలు..



ప్రభుత్వం చేపట్టిన కులగణనపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నేతలకు మంత్రి పొన్నం హితవు పలికారు. ఈ విమర్శలను బీసీలపై దాడిగానే పరిగణిస్తామన్నారు. బీసీల మేలు కోసం చేసే ప్రయత్నాలను అడ్డుకోవద్దని సూచించారు. కాస్ట్ సెన్సస్ డీటెయిల్స్ అందరికీ తెలిసేలా పబ్లిక్ డొమైన్‌లో పెట్టనున్నట్లు వెల్లడించారు. కులగణనపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

కులగణనపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టిన కులగణనపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. ఈ విమర్శలను బీసీలపై దాడిగానే చూస్తామని.. కొందరు సర్వేకు సహకరించలేదని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం నుంచి కల్వకుంట్ల కవిత ఒక్కరే వివరాలు ఇచ్చారన్నారు. కుల గణన సర్వే వివరాలు పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని తెలిపారు. కోడిగుడ్డుపై ఈకలు పీకిన చందంగా బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయంలో కొందరు నేతలు రాజకీయపరమైన దాడి చేయటం ఆపేయాలని హితవు పలికారు.

'అనుకున్న సమయంలోనే కులగణన పూర్తి చేసిన ప్రభుత్వ అధికారులను అభినందిస్తున్నా. కులగణనకు స్ఫూర్తినిచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. ఈ విప్లవాత్మక మార్పును స్వాగతిస్తూ అన్ని జిల్లాల్లోని బలహీన వర్గాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మేధావులు కార్యక్రమాలు చేపట్టాలి. ఈ సర్వేను మంగళవారం కేబినెట్, ఆ తర్వాత అసెంబ్లీలో ఉంచుతాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిరిగా తూతూ మంత్రంగా సర్వేలు జరిపి ఆ లెక్కలు బీరువాలకే పరిమితం చేయడం లేదు. కులగణన సర్వే వివరాలు అందరికీ తెలిసేలా పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతాం.' అని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

కులగణన సర్వేలో ఎక్కడైనా పొరపాట్లు జరిగాయని అనిపిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ విషయంలో ఏదైనా సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉందన్నారు.

ఇది పార్టీ పరంగా జరిగిన సర్వే కాదని.. ప్రభుత్వ పరంగా జరిగినదని స్పష్టంచేశారు. అధికారంలో ఉండగా బలహీనవర్గాలకు న్యాయం చేయని బీఆర్ఎస్ నేతలు.. ఏన్నో ఏళ్ల తర్వాత చేసిన కులగ గణనపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. బీసీల మేలు కోసం చేసే ప్రయత్నాలను ఎవరూ అడ్డుకోవద్దని మంత్రి పొన్నం సూచించారు. మంగళవారం జరిగే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొని కుల గణనపై అన్ని రాజకీయ పార్టీలు తమ స్టాండ్ ఏంటో తెలియచేయాలని కోరారు.

## 100 మంది యువతులతో డేటింగ్..

# రూ.333 కోట్లు టార్గెట్..

హైదరాబాద్ గచ్చిబౌలి ప్రిజం పబ్ కాల్పుల కేసు నిందితుడు బత్తుల ప్రభాకర్ గురించి విస్తుపోయే విషయాలు బయటకు వస్తున్నాయి. 17 ఏళ్ల వయస్సులో రూ.3 వేలతో దొంగతనాలు మొదలు పెట్టిన ప్రభాకర్.. ఆ తర్వాత కొన్ని నెలల్లోనే లక్షలకు లక్షలు చోరీ చేశాడు. చోరీ డబ్బుతో లగ్జరీ లైఫ్ గడుపుతున్న ప్రభాకర్ 100 మంది అమ్మాయిలతో డేటింగ్, రూ.333 కోట్లు కొల్లగొట్టడం టార్గెట్‌గా పెట్టుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. హైదరాబాద్ గచ్చిబౌలి ప్రిజం పబ్‌లో రెండ్రోజుల క్రితం కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. మోస్ట్ వాంటెడ్ గజదొంగ బత్తుల ప్రభాకర్ అలియాస్ బిట్టూ పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఓ కానిస్టేబులు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వద్ద నుంచి మూడు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిహార్ నుంచి తుపాకులను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రభాకర్‌పై గతంలో ఎక్కడెక్కడ కేసులు ఉన్నాయన్న అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, విచారణలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. చోరీల ద్వారా.. రూ.333 కోట్లు సంపాదించి ఆ తర్వాత నేరాలు మానేయాలని ప్రభాకర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. 100 మంది యువతులతోనూ డేటింగ్ చేయాలని అతడు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

బత్తుల ప్రభాకర్ స్వగ్రామం ఏపీలోని చిత్తూరు జిల్లా ఇరికిపెంట. 8వ తరగతితోనే చదువు మానేసిన ప్రభాకర్ 17 ఏళ్ల వయసులో దొంగతనాలు చేయటం ప్రారంభించా డు. రాహుల్ రెడ్డి, సర్వేశ్వర్ రెడ్డి, రాజు, హర్షవర్ధన్ రెడ్డి వంటి మారు పేర్లతో చోరీలు చేయటం ప్రారంభిచాడు. మొదట రూ.3 వేలు దొగిలించిన ప్రభాకర్ తన లక్కీ నెంబర్‌గా మూడును ఎంచుకున్నాడు. ఆ తర్వాత ఒకే రోజు రూ.3 లక్షలు, కొన్ని నెలల వ్యవధిలోనే రూ. 33 లక్షలు చోరీ చేశాడు. చివరగా రూ.333 కోట్లు కొల్లగొట్టి చోరీలు మానేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నాడు. డబ్బుతో పాటు 100 మంది యువతులతో డేటింగ్ చేయాలని కూడా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ మేరకు ఛాతీపై 3, 100 నెంబర్లను పచ్చబొట్లుగా పొడిపించుకున్నాడు.

అయితే డబ్బుతో పాటు ఓ వ్యక్తిపై ప్రతీకారం తీర్చుకునేందు కు బిహార్ నుంచి ప్రభాకర్ తుపాకులు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. 2022లో విశాఖపట్నం జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో ఓ ఖైదీతో ప్రభాకర్‌కు గొడవ జరిగింది. జైలు నుంచి బయటకు వచ్చాక అతడిని చంపాలని టార్గెట్‌గా పెట్టు కున్నాడు. బిహార్ నుంచి దేశీయ తుపాకులను కొనుగోలు చేశాడు. ప్రతీకారం తీర్చుకునేందుకు కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో మకాం వేశాడు. నార్సింగ్‌లోని ఓ గెటెడ్ కమ్యూనిటీలో ప్రభాకర్ నివాసం ఉంటున్నాయి. ఒకే సమయంలో ఇద్దరికి మంచి అమ్మాయిలతో సహజీవనం చేస్తున్నాడు. స్నేహితుల పేర్లతో సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్లు కొనుగోలు చేయడమే కాకుండా నెలకో కారు మారుస్తూ విలాసవంతమైన జీవితం గడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆదివారం అతడు అద్దెకు ఉంటున్న ఇంట్లో సోదాలు జరిపిన పోలీసులు రూ.50 వేల విలువైన మద్యం, జిమ్ సెటప్ ఖరీదైన గాడ్జెట్‌లు గుర్తించా రు. 3 దేశీయంగా తయారు చేసిన తుపాకులు, 451 రౌండ్ల బుల్లెట్లు, ఇనుప కడ్డీలు, ఎలక్ట్రికల్ కట్టర్లు, దోపిడీ సాధనాలు, రూ.2.6 లక్షలు నగదు సీజ్ చేశారు. ప్రభాకర్ దొంగతనం చేయటానికి ముందు చాలా పక్కగా ప్లాన్ చేసుకుంటాడు. యూట్యూబ్ వీడియోల ఆధారంగా పోలీసులకు చిక్కకుండా దోపిడీలు చేసేవాడు. ఆధారాలు దొరక్కుండా ముఖానికి ముసుగు, చేతులకు గ్లౌజులు ధరించేవాడు. దొంగలించిన సొమ్మును స్నేహితుల అకౌంట్లలో జమచేసి వాడుకునేవాడు. ప్రభాకర్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 80కి పైగా కేసులున్నాయి. తాజాగా కాల్పుల కేసులో పోలీసులు రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.

# ఇక నుంచి ఆ సర్వీసులు నడవవు

హైదరాబాద్ ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు బ్యాడ్‌న్యూస్. ఇక నుంచి నగరంలో నైట్ రైడర్ సర్వీసులు అందుబాటులో ఉండవు. ఆ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. నగరంలో రాత్రివేళ ప్రయాణాలు సాగించే వారి కోసం 2022 మే ఆర్టీసీ అధికారులు ఈ సేవలను ప్రారంభించారు. అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో సర్వీసులను నడిపారు. ప్రయాణికులను రాత్రి 10.30నుంచి ఉదయం 4గంటల వరకు గమ్యస్థానాలకు చేర్చే విధంగా ప్రత్యేకంగా రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసి బస్సు సర్వీసులను నడిపించారు. పటాన్‌చెరు, చాంద్రాయణగుట్ట, చార్మినార్, అఫ్జల్‌గంజ్, సెంట్రల్ బస్‌స్టేషన్(సీబీఎస్), చార్మినార్, దిల్‌సుఖ్‌నగర్ మార్గాల్లో ప్రయాణికులకు రాత్రి వేళల్లో సేవలు అందించేలా సికింద్రాబాద్ - పటాన్‌చెరు, సికింద్రాబాద్ - సీబీఎస్, సీబీఎస్ - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - చార్మినార్, చార్మినార్ - సికింద్రాబాద్ తదితర మార్గాల్లో ఈ బస్సులను నడిపించారు. రాత్రి వేళల్లో ప్రైవేటు క్యాబ్ సర్వీసులతో పోల్చితే తక్కువ ఛార్జీతో ప్రయాణం చేసే ఛాన్స్ ఉన్నా.. బస్సులకు సరైన ఆదరణ లేదు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీలో సమస్యలు రావటంతో బస్సు సర్వీసులు నడపటం కష్టం మారింది. పెద్దగా ఆదాయం కూడా లేకపోవటంతో నైట్ రైడర్ సర్వీసులు సేవలను నిలిపివేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు.

ఇక హైదరాబాద్ నగరంలో డే టైంలో బస్సులో తిరిగే వారి సంఖ్య పెరిగింది. మహాలక్ష్మీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన తర్వాత.. రద్దీ డబుల్ అయింది. గతంలో ప్రతి రోజూ 12 లక్షల మంది బస్సుల్లో ప్రయాణిస్తే ప్రస్తుతం ఆ సంఖ్య 24 నుంచి 28 లక్షలకు పెరిగింది. దీంతో కొత్త బస్సుల కొనుగోలుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్న ఈవీ బస్సులను కొనుగోలు చేసి నడుపుతున్నారు. త్వరలోనే మరికొన్ని ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పాత బస్సులు కొన్నిచోట్ల మొరాయిస్తున్నాయి. వాటి వల్లే వచ్చే పొగ కారణంగా కాలుష్యం కూడా విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో వాటి స్థానంలోనూ కొత్త బస్సులు కొనుగోలు చేయాలని సర్కార్ యోచిస్తోంది.

# చేనేత కార్మికులకు గుడ్‌న్యూస్..

తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. త్వరలోనే అర్హులను గుర్తించి తొలుత సిరిసిల్ల జిల్లాలో పథకాన్ని అమలు చేయనున్నారు. పథకంలో భాగంగా ఒక యూనిట్ కింద రూ.8 లక్షల విలువైన 4 లూమ్స్ ఇవ్వనున్నారు. యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీ, 40 శాతం బ్యాంక్ లోన్, 10 శాతం లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందని సమాచారం.

చేనేత కార్మికులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. కార్మికుల కోసం మరో సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టేందుకు రెడీ అవుతోంది. 'వర్కర్ టు ఓనర్' పథకం ద్వారా చేనేత కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలను రెడీ చేస్తోంది. ఈ పథకం కింద, కార్మికులకు అత్యాధునిక పవర్ లూమ్ యూనిట్లను మంజూరు చేయనున్నారు.



**పథకంలో భాగంగా ఒక యూనిట్ కింద రూ.8 లక్షల విలువైన 4 లూమ్స్ ఇవ్వనున్నారు. యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీ, 40 శాతం బ్యాంక్ లోన్, 10 శాతం లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందని సమాచారం.**

పథకం అమల్లో భాగంగా.. గతంలో నిర్మించిన వీవింగ్ షెడ్లలో పవర్ లూమ్స్ ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించేందుకు సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. ముందుగా ఈ పథకాన్ని సిరిసిల్ల జిల్లాలో అమలు చేయనున్నట్లు తెలిసింది. జిల్లాలో అర్హులను గుర్తించి ఆధునిక పవర్ లూమ్స్ అప్పగించే ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు జౌళిశాఖ అధికారులు తెలిపారు.

ఈ పథకం కింద ప్రతి యూనిట్‌కు రూ. 8 లక్షల విలువైన నాలుగు పవర్ లూమ్స్ మంజూరు చేయనున్నారు. ఆ 8 లక్షల్లో 50 శాతం అంటే 4 లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా అందించనుంది. మిగిలిన 40 మొత్తాన్ని బ్యాంకు లోన్లు మంజూరు చేయనుంది. లబ్ధిదారులు కేవలం 10 శాతం అంటే 80 వేలు చెల్లిస్తే సరిపోతుంది. తక్కువ రుణంతో బ్యాంకు రుణం మంజూరు కాగా.. దాన్ని విడతల వారీగా చెల్లించుకోవచ్చు. ఈ పథకం చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించనుందని అధికారులు తెలిపారు. వర్క్ టు ఓనర్ పథకం అమలయితే.. చేనేత రంగంలో కార్మికుల ఆర్థిక స్థితి మెరుగుపడే అవకాశముందని అంటున్నారు. ప్రస్తుతం కార్మికులకుగా ఉన్న నేతన్నలు ఓనర్లుగా మారి ఆదాయం పెంచుకునే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. ఉపాధి అవకాశాలు కూడా విస్తృతంగా ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఫైలట్ ప్రాజెక్టుగా ముందుగా.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. జిల్లాలో విజయవంతమైన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని విస్తరించేందుకు రేవంత్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ చర్య ద్వారా తెలంగాణ చేనేత రంగం మరింత పుంజుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# బుట్టబొమ్మ అసహనం



పూజా హెగ్డే ప్రస్తుతం దేవా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే హిందీ మీడియాతో మాట్లాడుతూ కాస్త అసహనం వ్యక్తం చేసింది. సూపర్ స్టార్ చిత్రాల్లో అవకాశం వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నారా అంటూ పూజా హెగ్డేని ప్రశ్న అడిగితే.. కస్సుమంది. పదే పదే స్టార్ హీరోలు అంటూ ప్రశ్నలు వేయడంతో అసలు మీ ప్రాబ్లం ఏంటి? అంటూ ఫైర్ అయిపోయింది. సెలెబ్రిటీలు మీడియా ముందుకు వచ్చినప్పుడు ఏదో ఒక కాంట్రవర్సీ చెలరేగుతూనే ఉంటుంది. కొన్ని సార్లు మీడియా నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు సెలెబ్రిటీలు అసహనం వ్యక్తం చేస్తుంటారు. ఇంకొందరు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాట వేస్తుంటారు. ఇక పదే పదే ఒకే విషయానికి సంబంధించిన ప్రశ్నలు వస్తే మాత్రం ఇలా పూజా హెగ్డేలా కస్సుమంటారు. తాజాగా ఇలా హిందీ మీడియా ప్రతినిధిపై పూజా హెగ్డే అసహనం వ్యక్తం చేసింది. స్టార్ హీరోల సినిమాల్లో నటించడం అదృష్టంగా భావిస్తున్నారా అంటూ హృతిక్ రోషన్, సల్మాన్ ఖాన్, రణ్ వీర్ సింగ్, షాహిద్ కపూర్ చిత్రాల గురించి మీడియా ప్రతినిధి అడిగాడు. ఆ చిత్రాలకు తాను అర్హురాలినే అని పూజా హెగ్డే చెప్పుకొచ్చింది. తనను ఆ చిత్రాల్లోకి తీసుకునేందుకు దర్శకనిర్మాతలకు వారి వారి కారణాలుంటాయని తెలిపింది. ఏదైనా సరే అవకాశం వచ్చినప్పుడు దానికి న్యాయం చేయాలనేది ముఖ్యమని చెప్పింది.

అలా చేస్తే అదృష్టం వరించినట్టే అని తాను అనుకుంటానని పూజా హెగ్డే చెప్పింది. తన జీవితంలోనూ అదే జరిగిందని తాను భావిస్తానని పూజా హెగ్డే చెప్పింది. ఒక వేళ అదృష్టం వల్లే తనకు అవకాశాలు వచ్చాయని అనుకున్నా కూడా తనకేమీ అభ్యంతరం లేదని, అలానే అనుకోండని కౌంటర్లు వేసింది. మీరు సినిమాల్ని ఎలా సెలెక్ట్ చేసుకుంటారు..? స్టార్ హీరోల సినిమాలు అయితేనే చేస్తారా? అని అడిగితే పూజా హెగ్డే ఫైర్ అయిపోయింది. అలా పదే పదే స్టార్ హీరోలు అని మెన్షన్ చేసి ప్రశ్నలు వేస్తుండటంతో.. అసలు మీ బాధ ఏంటి? అని అడిగేసింది. దీంతో ఆ టాపిక్‌ను డైవర్ట్ చేస్తూ వాతావరణాన్ని కూల్ చేసేందుకు షాహిద్ కపూర్ జోకులు వేశాడు. దేవా సినిమాకు గొప్ప టాక్ ఏమీ రాలేదన్న సంగతి తెలిసిందే.

# నాని కోసం మరోసారి...



శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం నానితో ఓ సినిమాను చేస్తున్నాడు. ప్యారడైజ్ మూవీతో శ్రీకాంత్ ఓదెల మరోసారి రచ్చ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఈ క్రమంలో ఈ మూవీకి అనిరుధ్‌ను తీసుకుంటున్నారని ఇది వరకు రూమర్లు వచ్చాయి. ఇప్పుడు ఆ రూమర్లనే నిజం చేశారు. అనిరుధ్ సంగీత సారథ్యంలో నాని మరోసారి అందరినీ మెప్పించేందుకు రెడీ అవుతున్నాడు. గ్యాంగ్ లీడర్, జెర్సీలతో నాని అనిరుధ్ కాంబోకి క్రేజ్ పెరిగిందన్న సంగతి తెలిసిందే.



నాని, అనిరుధ్ అంటే అందరికీ గ్యాంగ్ లీడర్, జెర్సీ సినిమాలు గుర్తుకు వస్తాయి. అందులో నాని కోసం అనిరుధ్ ఇచ్చిన మెలోడీ పాటలు శ్రోతల్ని ఎంతగా ఆకట్టుకున్నాయో అందరికీ తెలిసిందే. నాని, అనిరుధ్ కాంబోకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇక శ్రీకాంత్ ఓదెలతో నాని చేస్తున్న రెండో ప్రాజెక్ట్ కోసం అనిరుధ్‌ను తీసుకోవాలి అంటూ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. ప్యారడైజ్ ప్రాజెక్ట్ కోసం అనిరుధ్ లాక్ అయ్యాడంటూ రూమర్లు కూడా వచ్చాయి.

ఇక ప్యారడైజ్ కోసం అనిరుధ్‌ను రంగంలోకి దించామని యూనిట్ అధికారికంగా ప్రకటించింది. అంతే కాకుండా ప్యారడైజ్ ప్రపంచాన్ని చూపించే క్రమంలో ఓ గ్లింప్స్‌ను కూడా రెడీ చేస్తున్నారట. ఆ గ్లింప్స్‌లో నాని, అనిరుధ్ కాంబో సత్తా ఏంటో చూపించేలా ఎన్నో హై మూమెంట్స్ ఉంటాయని తెలుస్తోంది. ఈ గ్లింప్స్‌ను శ్రీకాంత్ ఓదెల నెక్ట్స్ లెవెల్లో ప్లాన్ చేశాడని, అద్భుతంగా ఉండబోతోందని అంటున్నారు.

ప్రస్తుతం నాని హిట్ 3 సినిమాను ఫినిష్ చేసే పనిలో పడ్డాడు. ఆ తరువాత ప్యారడైజ్ మూవీ మీదకు పూర్తిగా షిఫ్ట్ అవుతాడు. శ్రీకాంత్ ఓదెల పూర్తి ఫోకస్ అయితే ప్రస్తుతం ప్యారడైజ్ మీదే ఉందన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ తరువాత శ్రీకాంత్ ఓదెల తన ఫుల్ కాన్సన్‌ట్రేషన్ చిరు మూవీ మీద పెట్టబోతోన్నాడు. ఇప్పటికే చిరు ఓదెల ప్రాజెక్ట్ మీద ఏర్పడిన అంచనాలు అందరికీ తెలిసిందే. బ్లడ్ బాత్ చేయించేలా ఈ సినిమా ఉండబోతోందని ఆ పోస్టర్లను చూస్తేనే తెలుస్తుంది.

శ్రీకాంత్ ఓదెలకు మంచి మ్యూజిక్ టేస్ట్ ఉందని దసరా మూవీని చూస్తేనే తెలుస్తుంది. పాటలైనా, ఆర్ఆర్ అయినా కూడా తన మార్క్ ఉండేలా చూసుకున్నాడు శ్రీకాంత్ ఓదెల. మరి ఈ ప్యారడైజ్ మూవీకి ఎలాంటి అవుట్ పుట్‌ను అనిరుధ్ నుంచి రాబట్టుకుంటాడో చూడాలి. అసలే నాని అంటే అనిరుధ్ మంచి మెలోడీస్ ఇస్తుంటాడని టాక్. ఈ సారి ఎలాంటి ఆల్బమ్ వస్తుందో చూడాలి.

# తాళిబొట్టు ఎక్కడ?






కీర్తి సురేష్ పెళ్లి తరువాత వెంటనే బేబీ జాన్ మూవీ ప్రమోషన్స్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ ప్రమోషన్స్‌లో కీర్తి సురేష్ కాస్త బోల్డ్ దుస్తుల్లోనే కనిపించింది. కానీ ఆమె మంగళసూత్రం హైలెట్ అయ్యేలానే క్యాస్టూమ్స్‌ను ప్రిపేర్ చేసుకుంది. తాళి బొట్టు తీయకుండా అలానే పెట్టుకుందని, మన ఆచారాల్ని పాటిస్తోందంటూ కీర్తి సురేష్ మీద ప్రశంసలు కురిపించారంతా. తాజాగా ఆమె వదిలిన ఫోటోల మీద కొందరు తెలిసీ తెలియకుండా ట్రోలింగ్ చేస్తున్నారు.

కీర్తి సురేష్ ప్రస్తుతం ఫ్యామిలీ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తోంది. బేబీ జాన్ అంటూ గత డిసెంబర్ ఫుల్ బిజీగా ఉండిపోయింది. పెళ్లి టైంలోనే సినిమా ప్రమోషన్స్ కూడా చేయాల్సి వచ్చింది. అటు పెళ్లి పనులు, ఇటు సినిమా పనుల్ని కవర్ చేసింది కీర్తి సురేష్. అయితే ఎంత కష్టపడ్డా కూడా తగిన ప్రతిఫలం అయితే రాలేదు. బేబీ జాన్ అంటూ బాలీవుడ్‌లో గ్రాండ్‌గా అడుగు పెట్టాలని కీర్తి సురేష్ చూసింది. కానీ ఆమె డెబ్యూ సినిమా అక్కడ డిజాస్టర్‌గా మారింది. ఇక ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా కీర్తి సురేష్ తాళిబొట్టుతో కనిపించి అందరినీ మెప్పించింది. బోల్డ్ అవతారంలో ఉన్నా కూడా, సినిమా ప్రమోషన్స్‌లోనూ తాళి బొట్టు తీయలేదని, మన ట్రెడిషన్‌ను బాగానే ఫాలో అవుతోందంటూ కీర్తి సురేష్ మీద అంతా ప్రశంసలు కురిపించారు. అయితే తాజాగా కీర్తి సురేష్ వదిలిన ఫోటోలు చూసి కొందరు షాక్ అవుతున్నారు. కీర్తి సురేష్ తాజాగా వదిలిన ఫోటోల్లో తాళి బొట్టు కనిపించలేదు. దీంతో మంగళసూత్రం ఏది? అప్పుడే తీసేశావా? అంటూ ట్రోలింగ్ చేస్తున్నారు. కానీ అవి మెహెందీ ఈవెంట్ ఫోటోలని, పెళ్లికి ముందు దిగిన ఫోటోలని తెలుసుకోలేకపోతోన్నారు. కీర్తి సురేష్ తన చిన్న నాటి స్నేహితుడు ఆంటోని తట్టేల్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ విషయాన్ని రీసెంట్‌గానే కీర్తి సురేష్ చెప్పింది. ఇక ఓసారి ఆంటోని బర్త్ డేకు దళపతి విజయ్‌ను సీక్రెట్‌గా పిలిచి సర్ ప్రైజ్ చేసిందట. అదే ఆంటోనికి తాను ఇచ్చిన బెస్ట్ సర్ ప్రైజ్, బెస్ట్ గిఫ్ట్ అని కీర్తి సురేష్ చెబుతుంటుంది.

# పేరు మార్చుకుంటా అనలేదు..

నాగ చైతన్య, సాయి పల్లవి తండేల్ మూవీ నుంచి ఇప్పటి వరకు వచ్చిన కంటెంట్ ఎలా ఉందో అందరూ చూశారు. ఓ అందమైన ప్రేమ కథను చూడబోతోన్నామని అందరికీ ఓ క్లారిటీ వచ్చింది. బుజ్జి తల్లి, హైలెస్సా పాటల్ని చూస్తుంటే ఈ కథలో ఎంత డెప్త్ ఉందో అర్థమై పోతోంది. ఇక ఈ మూవీ ఫిబ్రవరి 7న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉంటోంది. అల్లు అరవింద్ సైతం తనకు వీలైనంత ప్రమోట్ చేస్తున్నాడు.

చెన్నై, ముంబైలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్లకు అల్లు అరవింద్ వెళ్లాడు. చెన్నై, ముంబైల్లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లతో అల్లు అరవింద్ కూడా మాట్లాడాడు. చెన్నైలో కార్తీ వచ్చి తండేల్ ట్రైలర్‌ను రిలీజ్ చేస్తే.. ముంబైలో ఆమిర్ ఖాన్ వచ్చిన నాగ చైతన్యకు సపోర్ట్ చేశాడు. ఇక ఈ తండేల్ గురించి చందూ మొండేటి ముందు నుంచీ కూడా హైప్ ఎక్కిస్తున్నాడు. ఇది నిజంగా జరిగిన కథ అని, అందుకే శ్రీకాకుళం వెళ్లి రియల్ ఇన్సిడెంట్‌లకు సంబంధించిన మరిన్ని విషయాల్ని కనుక్కోవడం, అక్కడ మనుషులతో కలిసి తిరిగి మరింత లోతుగా తెలుసుకున్నామని చెబుతున్నాడు. తండేల్ కథలో పాకిస్తాన్ ఎపిసోడ్ దాదాపుగా 20 నిమిషాలు ఉంటుందని అంటున్నారు. ఇక ఈ మూవీ చూసిన తరువాత ఎవరు గొప్పగా నటించారు.. సాయి పల్లవా? నాగ చైతన్యనా? అనే చర్చలు మాత్రం కచ్చితంగా వస్తాయట. నాగ చైతన్యకు ఇది కెరీర్ బెస్ట్ పర్ఫామెన్స్ అవుతుందని అంటున్నాడు. ఇక ఈ మూవీని ప్రేమికులు మాత్రం కచ్చితంగా రిపీటెడ్‌గా చూస్తారని చందూ మొండేటి చాలా నమ్మకంతో చెబుతున్నాడు. హిట్ కాకపోతే తాను పేరు మార్చుకుంటాను అని అనలేదు.. ప్రేమికులు ఈ మూవీని రిపీటెడ్‌గా చూస్తారని, చూడకపోతే పేరు మార్చుకుంటాను అని చందూ మొండేటి అంటున్నాడు. మరి నిజంగానే రియల్ లవర్స్ రీల్ లవర్స్‌ను చూసి మురిసి పోతారేమో చూడాలి. తండేల్ మాత్రం ఫుల్ పాజిటివ్ బజ్‌తో థియేటర్లోకి రాబోతోంది.



# అంటోంది మిమ్మల్నే రాజు గారు..



సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు పెట్టిన బడ్జెట్, వచ్చిన టాక్, రికార్డులు క్రియేట్ చేస్తున్న కలెక్షన్లు అందరికీ తెలిసిందే. వంద పెడితే.. రెండొందలు, మూడొందలు వచ్చే రేంజ్‌లో సంక్రాంతికి వస్తున్నాం సినిమా లాభాల్ని తెచ్చి పెడుతోంది. ఇప్పటికే ఈ మూవీకి 300 కోట్ల గ్రాస్ వచ్చింది. ఈ సంక్రాంతికి నిజమైన సక్సెస్ సాధించింది ఈ మూవీనే. మిగతా రెండు చిత్రాల్లో ఒకటి తీవ్ర నష్టాల్ని తెచ్చి పెడితే ఇంకోటి అలా మొత్తానికి గట్టెక్కించేసింది. దిల్ రాజు ఎప్పుడూ భారీ బడ్జెట్ అంటూ ప్రయోగాలు చేయలేదు. లిమిటెడ్ బడ్జెట్‌లో కొత్త వారితో సినిమాలు చేసిన ప్రతీ సారి బ్లాక్ బస్టర్లు అందుకున్నాడు. ఎప్పుడైతే కథను పక్కన పెట్టి కాంబినేషన్ల వెనకాల దిల్ రాజు పరిగెత్తడం మొదలు పెట్టాడో అప్పుడే డౌన్ ఫాల్ స్టార్ట్ అయింది. గత కొన్నేళ్లలో దిల్ రాజు నుంచి సరైన హిట్ రాలేదు. దిల్ రాజుకి ఆడియెన్స్ పల్స్ పట్టుకోవడంలో పస తగ్గిందని అంతా అనుకుంటూ ఉన్నారు. ఇక దిల్ రాజు చేసిన మొదటి ప్రయోగం గేమ్ ఛేంజర్. భారీ బడ్జెట్ అంటూ శంకర్, రామ్ చరణ్ కాంబోతో దిల్ రాజు ప్రయోగం చేశాడు. అయితే ఇందులో దిల్ రాజుకి నష్టపోయింది ఏమీ లేదని సమాచారం. ఆ సినిమా మొత్తానికి జీ స్టూడియోస్ ఖర్చు పెట్టిందట. పైగా ప్రొడక్షన్ చేసి ఇచ్చినందుకు దిల్ రాజుకే తిరిగి జీ స్టూడియోస్ చెల్లించిందట. అయితే దిల్ రాజు ఇక్కడ కథను కాకుండా కాంబోని నమ్ముకున్నాడు. శంకర్, రామ్ చరణ్ క్రేజీ కాంబినేషన్‌తో మరింత లాభాలు తెచ్చుకుందామని అనుకున్నాడు. కానీ చివరకు సినిమా తేడా కొట్టేసింది.

ఇక ఇదే సంక్రాంతికి దిల్ రాజు సంక్రాంతికి వస్తున్నాం రిలీజ్ చేశాడు. గేమ్ ఛేంజర్ వల్ల డిస్ట్రిబ్యూటర్లకు వచ్చిన నష్టాల్ని ఈ సినిమాతో కవర్ చేసినట్టుగా అయింది. డిస్ట్రిబ్యూటర్లంతా కలిసి ఇంత సంతోషంగా ఉండటం, ఇలా బయటకు వచ్చి మీడియాతో మాట్లాడటం, డిస్ట్రిబ్యూటర్లే సినిమా టీంకు సక్సెస్ సెలెబ్రేట్ చేయడం ఇదే మొదటి సారి. ఈ క్రమంలో వెస్ట్ డిస్ట్రిబ్యూటర్ ఎల్వీఆర్ మాట్లాడిన మాటలు ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

కాంబినేషన్ కాదు.. బడ్జెట్ కాదు.. కంటెంట్ ముఖ్యమని, కంటెంట్ ఉంటేనే జనాలు చూస్తారని.. ఎంత బడ్జెట్ పెట్టారన్నది జనాలు పట్టించుకోరు అన్నట్టుగా ఎల్వీఆర్ మాట్లాడుతూ ఉంటే.. వెనకాల దిల్ రాజు పగలబడి నవ్వుతున్నాడు. అలా అంటోంది దిల్ రాజునే అయినా.. దిల్ రాజు నవ్వుతూ కవర్ చేసినట్టుగా అనిపిస్తోంది. తన ముందే నిల్చుని తనపైనే కౌంటర్లు వేస్తున్నా.. ఏం చేయలేక నవ్వుతూ ఉన్నాడంటూ దిల్ రాజు మీద నెటిజన్లు ట్రోలింగ్ చేస్తున్నారు. తిడుతోంది మిమ్మల్నే కదా.. మీరే కదా ఇష్టమొచ్చిన బడ్జెట్ పెట్టేసుకుని సినిమాలు తీస్తు న్నారు.. మిమ్మల్నే అంటున్నా.. మీరు మాత్రం అలా పగలబడి ఎందుకు నవ్వుతున్నారు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ మూవీని చూసి ఎంజాయ్ చేశామని ఒప్పుకుంటాం.. కానీ దీన్ని కంటెంట్ ఉన్న సినిమాకి ఓ ఉదాహరణగా చెప్పడం మాత్రం కాస్త జోక్‌గా, నవ్వులాటగా అనిపిస్తోంది. ఇదేమీ గొప్ప కంటెంట్ ఉన్న సినిమా కాదు.. అని ట్రోలింగ్ చేస్తున్నారు.

# కండీషన్ పెట్టడం వల్లే అవకాశాలు వదులుకున్నా



నిధి అగర్వాల్ ప్రస్తుతం రెండు చిత్రాల రిలీజ్ కోసం ఎంతగానో ఎదురుచూస్తోంది. హరి హర వీరమల్లు, ప్రభాస్ రాజా సాబ్ సినిమాల్లో నిధి అగర్వాల్ నటిస్తోంది. ఈ రెండు చిత్రాలు వాయిదా పడుతూనే వస్తున్నాయి. మొత్తానికి ఇదే ఏడాది ఈ రెండు సినిమాలు రిలీజ్ అయ్యే అవకాశాలు మాత్రం ఉన్నాయి. తాజాగా ఈ చిత్రాల గురించి నిధి అగర్వాల్ మీడియాతో పంచుకుంది.

నిధి అగర్వాల్ ప్రస్తుతం రెండు సినిమాల షూటింగ్‌లతో బిజీగా ఉంది. రాజా సాబ్ షూటింగ్ కంటిన్యూగా జరుగుతోంది. మరో వైపు హరి హర వీరమల్లు షూటింగ్ కాస్త ముందుకు వెనక్కి అన్నట్టుగా సాగుతోంది. ఈ రెండు చిత్రాల కోసం నిధి అగర్వాల్ ఎంతగానో ఎదురుచూస్తోంది. తాజాగా మీడియాతో నిధి అగర్వాల్ మాట్లాడుతూ తన సినీ ప్రయాణం, పర్సనల్ విషయాలు అంటూ ఇలా అన్ని విషయాల్ని పంచుకుంది. హైదరబాద్‌లో పుట్టానని, బెంగళూరులో స్థిర పడ్డామని నిధి అగర్వాల్ చెప్పుకొచ్చింది.

సినిమాల్లోకి వెళ్తాను అని ఇంట్లో చెబితే ముందుగా చదువుకో అని చెప్పారట. అలా చదువులు పూర్తయ్యాక ముంబైకి వెళ్లి సినిమా ప్రయత్నాలు మొదలు పెట్టింది. అలా చాలా ఆడిషన్స్ కూడా ఇచ్చింది. ఎన్నో ప్రొడక్షన్ కంపెనీలు అవకాశాలు ఇవ్వకుండా తిప్పించుకున్నాయని, ఆ టైంలో ఎంతో బాధపడ్డానని నిధి అగర్వాల్ తెలిపింది. అలా చివరకు మున్నా మైఖేల్ సినిమాలో అవకాశం వచ్చింది. అది చూసే తనకు సవ్యసాచిలో అవకాశం వచ్చిందట. హీరో మూవీనే తనకు చివరి చిత్రమని, ఆ తరువాత చాలా రోజులు సినిమాలు లేకుండా పోయాయట. కరోనా టైంలోనే హరి హర వీరమల్లు సినిమా ఆఫర్ వచ్చిందట. ఆ చిత్రం కంప్లీట్ అయ్యే వరకు ఇంకో సినిమాను చేయకూడదనే కండీషన్ పెట్టారట. అలా ఎన్నో అవకాశాలు వచ్చినా వదులుకోవాల్సి వచ్చిందట. ఇక హరి హర వీరమల్లు పలు మార్లు వాయిదా పడుతూ వచ్చిందట. వాళ్లు ఓకే చెప్పిన తరువాత రాజా సాబ్‌కు సంతకం చేసిందట. తనకు హారర్ మూవీస్ అంటే చాలా భయమని, ఇప్పటికీ ఒంటరిగా ఆ సినిమాల్ని చూడలేనని చెప్పుకొచ్చింది. అలా తనలా భయపడే వాళ్లు మాత్రం కచ్చితంగా ఫ్యామిలీతో పాటే రాజా సాబ్ సినిమాను చూడమని సలహా ఇచ్చింది. ఇక తనకు మణిరత్నం సఖి చాలా ఇష్టమని, ఆ సినిమాను లెక్క పెట్టలేనన్ని సార్లు చూశానని చెప్పుకొచ్చింది.

# డిస్ట్రిబ్యూటర్ మాటల అర్థమిదేనా?

డిస్ట్రిబ్యూటర్ల పరిస్థితి ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. నష్టాలు వచ్చినా కూడా బయటకు చెప్పుకోలేని దుస్థితిలో ఉంటారు. ప్రొడక్షన్ కంపెనీలో, హీరో సైడ్ నుంచే డిస్ట్రిబ్యూటర్లకు ఒత్తిడి కామన్‌గానే ఉంటుంది. అందుకే పెద్ద సినిమాలు హిట్ అని చెప్పుకున్నా కూడా కింది స్థాయిలో డిస్ట్రిబ్యూటర్లకు మాత్రం భారీ నష్టాల్ని మిగిల్చేస్తుంటుంది. అలా తాజాగా వెస్ట్ డిస్ట్రిబ్యూటర్ ఎల్వీఆర్ తాజాగా మాట్లాడిన మాటలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

సంక్రాంతి సీజన్‌లో రిలీజ్ అయిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాకి అదిరిపోయే టాక్‌తో పాటు, బ్లాక్ బస్టర్ కలెక్షన్లు వచ్చాయి. ఈ మూవీకి ఇప్పటికే 300 కోట్లకు పైగా గ్రాస్ వచ్చింది. ఈ లెక్కలు మాత్రం నిజం అన్నట్టుగా డిస్ట్రిబ్యూటర్లంతా కూడా మీడియా ముందుకు వచ్చారు. అసలు లెక్కల్ని డిస్ట్రిబ్యూటర్లు ఎప్పుడూ బయటపెట్టరు. వారికి నష్టాలు వచ్చినా బయటకు చెప్పుకోలేని పరిస్థితి ఉంటుంది. సినిమా పోస్టర్ల మీద వందల, వేల కోట్లు కనిపిస్తాయి. కానీ డిస్ట్రిబ్యూటర్ ఖాతాల్లో మాత్రం నష్టాలే మిగులుతాయి.

కానీ సంక్రాంతికి వస్తున్నాం సినిమాని కొన్న ప్రతీ ఒక్క డిస్ట్రిబ్యూటర్ జేబులు నిండిపోయాయి. విపరీతమైన లాభాల్ని గడిస్తున్నారు. దీంతో ధైర్యంగా మీడియా ముందుకు వచ్చారు. డిస్ట్రిబ్యూటర్ గ్రాటిట్యూడ్ ఈవెంట్ అంటూ మొదటి సారిగా డిస్ట్రిబ్యూటర్ల మీడియా ముందుకు వచ్చి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ క్రమంలో మీడియా నుంచి ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆ ఆన్సర్లను విశ్లేషిస్తూ గత కొన్నేళ్లుగా డిస్ట్రిబ్యూటర్లు నష్టపోతూనే ఉన్నారని అర్థం అవుతోంది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,